# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 131 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 01 జులై 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 131 01-07-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




కృష్ణమ్మ పరవళ్లు - నిండుకుండలా శ్రీశైలం జలాశయం

2 లో..





## కెమికల్ ఫ్యాక్టరీలో..
# భారీ పేలుడు

### సిగాచి వైస్ ప్రెసిడెంట్ సహా 16 మంది మృత్యువాత

**అమరావతి జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం సిగాచి పరిశ్రమలో రియాక్టర్ పేలుడు సంభవించిన విషయం

- తరువాయి 2లో..

### మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్టపరిహారం



సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు ప్రధాని మోదీ. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్విట్ చేశారు.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తునట్లు చెప్పారు. కాగా, మృతుల బంధువులకు ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50,000 ఎక్స్ గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించారు.



## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేం: కేంద్ర కమిటీ

**ఈ ప్రాజెక్టుకు అభ్యంతరాలు వచ్చాయన్న కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ**

**గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ తీర్పును పరిశీలించాలన్న కమిటీ**

**పర్యావరణ ప్రభావంపై అంచనా వేసిన తర్వాతే అనుమతి అన్న కమిటీ**

**అమరావతి జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటి స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పలు అభ్యంతరాలు ఉన్నాయని పేర్కొంది. అనుమతులు ఇవ్వాలంటే గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్

- తరువాయి 2లో..



## ప్రధాని మోదీ విదేశీ పర్యటన..
## 8 రోజులు, 5 దేశాల్లో పర్యటన!

**జులై 2 నుంచి 9 వరకు ప్రధాని మోదీ 8 రోజుల విదేశీ పర్యటన**

**ఘనా, ట్రినిడాడ్, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శించనున్న ప్రధాని**

**బ్రెజిల్‌లో జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్న మోదీ**

**గ్లోబల్ సౌత్ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం**

**దశాబ్దాల తర్వాత ఘనా, ట్రినిడాడ్‌లో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం**

**న్యూఢిల్లీ జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. జులై 2వ తేదీ నుంచి ఎనిమిది రోజుల పాటు రెండు ఖండాల్లోని ఐదు దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శిస్తారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడంతో పాటు, గ్లోబల్ సౌత్‌లోని కీలక దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది.

**దశాబ్దాల తర్వాత కీలక దేశాల్లో పర్యటన**

విదేశాంగ శాఖ ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి తెలిపిన వివరాల ప్రకారం,

- తరువాయి 2లో..

# అమరావతిలో క్వాంటమ్ పార్క్

- ఏపీని టెక్ హబ్‌గా చేస్తామన్నచంద్రబాబు
- విజయవాడలో క్వాంటమ్ వ్యాలీపై జాతీయ స్థాయి వర్క్‌షాప్
- క్వాంటమ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటన
- ప్రభుత్వంతో చేతులు కలపనున్న టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ
- భవిష్యత్ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని చంద్రబాబు పిలుపు
- అధునాతన టెక్ కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం

**అమరావతి జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీని టెక్ హబ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అమరావతిలో క్వాంటమ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. విజయవాడలో సోమవారం 'క్వాంటమ్ వ్యాలీ' అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమానికి ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రభుత్వంతో చేతులు కలిపిన టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థలకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తాను గతంలో సీఎంగా ఉన్నప్పటి అనుభవాలను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "నేను తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టే సమయానికి ఐటీ పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. అప్పట్లో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో సమావేశమై ఐటీ అభివృద్ధిపై చర్చించాను. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో హైటెక్ సిటీని నిర్మించాలని ఎల్ అండ్ టీ సంస్థను కోరాను. ఆ స్ఫూర్తితోనే ఇప్పుడు అమరావతిని అభివృద్ధి చేస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఐటీ హబ్‌గా



- తరువాయి 2లో..







## బీజేపీకి రాజాసింగ్ రాజీనామా

**బీజేపీ సభ్యత్వానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా**

**రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల వేళ సంచలన నిర్ణయం**

**తన అనుచరులను బెదిరించారని తీవ్ర ఆరోపణ**

తెలంగాణ బీజేపీ పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ నాయకత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆయన, ఇకపై బీజేపీలో కొనసాగలేనని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే, రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజాసింగ్ ఈ మధ్యాహ్నం తన మద్దతుదారులతో కలిసి నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో తన అనుచరులను కొందరు నేతలు బెదిరించారని ఆయన ఆరోపించారు. ఈ పరిణామంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను కేంద్ర మంత్రి, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజాసింగ్ పార్టీ అధిష్టానంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కేంద్రంలోని పెద్దలకు ఇష్టం లేదు. అందుకే ఇలాంటి పరిస్థితులు సృష్టిస్తున్నారు. అధ్యక్షుడిని ముందే నిర్ణయించుకుని, ఎన్నికల పేరుతో నాటకాలు ఆడుతున్నారు" అని ఆయన ఆరోపించారు. 2019 నుంచి పార్టీ కోసం

- తరువాయి 2లో..


## అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీగా
# అభివృద్ధి చేస్తాం..

**అమరావతి క్వాంటమ్ వ్యాలీ ద్వారా వచ్చే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాల కల్పన లక్ష్యం**

**50కి పైగా యూనికార్న్ ల అభివృద్ధి**

**చంద్రబాబు గారి సాంకేతిక విప్లవంలో సెకెండ్ చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ**

**అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాప్ లో మంత్రి నారా లోకేష్**




**అమరావతి జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ అని, ప్రజారాజధాని అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయవాడలోని నోవాటెల్ హెూటల్ లో నిర్వహించిన అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాప్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో

- తరువాయి 2లో..



## జాతీయ క్రీడల విజేతలకు ఏపీ ప్రభుత్వం భారీ నగదు ప్రోత్సాహకాలు

**ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ పోటీల్లో గెలిచిన వారికి బహుమతి**

**రాష్ట్రానికి చెందిన 15 మంది క్రీడాకారులకు లబ్ధి**

**మొత్తం రూ.91.75 లక్షల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు**

**ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ సంయుక్తంగా నిధుల విడుదల**

**అమరావతి జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ఏపీలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన 38వ జాతీయ క్రీడా పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఈ మేరకు మొత్తం రూ. 91.75 లక్షల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జాతీయ క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి

- తరువాయి 2లో..

## ఏపీ, తెలంగాణ బీజేపీ అధ్యక్షులుగా
# మాధవన్, రామచంద్రరావు





**తెలంగాణ, అమరావతి జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బీజేపీ తన వ్యూహాత్మక నిర్ణయాలతో ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తూ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల ఎంపికలో కూడా ఈ విషయం మరోసారి స్పష్టమైంది. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌ను, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా సీనియర్ నేత ఎన్. రామచంద్ర రావును పార్టీ ఎంపిక చేసింది. ఈ రెండు స్థానాల కోసం అనేకమంది పోటీలో ఉన్నప్పటికీ, ఆరెస్సెస్ అండదండలు ఉన్నవారికి, పార్టీలో సుదీర్ఘ అనుభవం కలిగినవారికి, సౌమ్యులకు ఈ బాధ్యతలను అప్పగించింది.

**ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్**

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్ష పదవి కోసం విష్ణువర్ధన్ రెడ్డి, భానుప్రకాశ్, డాక్టర్ పీవీ పార్థసారథి, సుజనా చౌదరి, ఆదినారాయణ రెడ్డి తదితరులు పోటీ పడ్డారు. అయితే, పార్టీ హైకమాండ్ పీవీఎన్ మాధవ్‌ను ఎంపిక చేసింది. ఆరెస్సెస్‌తో బలమైన సంబంధాలు మాధవ్ ఎంపికకు బలమైన కారణం. పైగా ఆయన రెండోతరం బీజేపీ నాయకుడు.

ఆయన తండ్రి పీవీ

- తరువాయి 2లో..

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## గణాంక శాస్త్రం.. అభివృద్ధికి సాధనం

ప్రతి సంవత్సరం జూన్ 29న భారతదేశంలో జాతీయ గణాంక దినోత్సవాన్ని జరుపుకోవడం అనేది గణాంకాల ప్రాముఖ్యతను గుర్తు చేసే ఓ అరుదైన సాంప్రదాయం. ఈ రోజు భారత గణాంక శాస్త్ర పితామహుడు, ప్రముఖ శాస్త్రవేత్త, ఆర్థిక ప్రణాళికా మార్గదర్శకుడు అయిన ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జయంతి. ఆయన సేవలను స్మరించుకునే కార్యక్రమాలే ఈ దినోత్సవానికి మూలం. గణాంక శాస్త్రాన్ని భారతదేశ అభివృద్ధికి ఒక సూత్రమైన సాధనంగా తీర్చిదిద్దిన మహాలనోబిస్ కృషికి ఇదే సరైన నివాళి. ప్రొఫెసర్ మహాలనోబిస్ 1893, జూన్ 29న కలకత్తాలో జన్మించారు. ప్రెసిడెన్సీ కాలేజీలో భౌతిక శాస్త్రం అభ్యసించి, తరువాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య పొందారు. అక్కడే గణాంక శాస్త్రంపట్ల ఆయన ఆసక్తి పెరిగింది. తిరిగి భారతదేశానికి వచ్చిన తరువాత ఆయన స్థాపించిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) దేశంలో గణాంక విద్య, పరిశోధనకు కేంద్రంగా మారింది.

వ్యవసాయ, ఉపాధి, జనాభా వంటి రంగాల్లో నమూనా సర్వేలు నిర్వహించి వాటి ఆధారంగా ప్రభుత్వ విధానాల రూపకల్పనకు మార్గదర్శకత్వం వహించారు. ఆయన అభివృద్ధి చేసిన మహాలనోబిస్ దూరం అనే గణాంక ప్రమాణం వర్గీకరణ, నమూనా గుర్తింపు వంటి అనేక సాంకేతిక రంగాల్లో ఉపయోగపడుతోంది. 1956లో ప్రారంభమైన ద్వితీయ పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో ఆయన రూపొందించిన మహాలనోబిస్ మోడల్ అనేది పారిశ్రామికాభివృద్ధికి ప్రాముఖ్యత నిచ్చే విధంగా రూపొందించబడింది. ఆయన సలహాలతో కేంద్ర గణాంక సంస్థ (సిఎస్ఒ) స్థాపించ బడింది, ఇది నేటి జాతీయ గణాంక కార్యాలయంగా పరిణమించింది. ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1968లో పద్మవిభూషణ్ పురస్కారం ప్రదానంచేసింది. జాతీయ గణాంక దినోత్సవం ద్వారా గణాంకాల సామర్థ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

గణాంకం కేవలం గణనకోసం మాత్రమే కాక, ప్రభుత్వ పాలన, విధాన నిర్ణయాలలో విశ్వసనీయ ఆధారంగా నిలుస్తుంది. ఉదాహరణకు, 2023 నాటికి భారత్ జనాభా 142 కోట్లకు చేరింది.

ఈ జనాభా నిర్మాణాన్ని బట్టి వివిధ సందర్భాలలో విద్య, ఆరోగ్య సేవల కేటాయింపులు, ఉపాధి ప్రణాళికలు రూపొందించబడుతున్నాయి. అంతేకాక, పేదరిక స్థాయి గణాంకాల ప్రకారం 2011 -12 దేశంలో 21.9 శాతం మంది పేదరిక రేఖకు దిగువన ఉన్నారు. ఇటువంటి గణాంకాలు లేకుండా ఏ విధానం ప్రయోజనకరంగా ఉంటుందో అంచనా వేయడం అసాధ్యం. ఇప్పటి డేటా ఆధారిత ప్రపంచంలో గణాంక శాస్త్రం మరింత విస్తరించి, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో అనుసంధానమవుతోంది. బిగ్ డేటా విశ్లేషణలు, ఆన్‌లైన్ సర్వేలు, డిజిటల్ డేటా సమీకరణం వంటివి సమాజంలోని మార్పులను విశ్లేషించడానికి కీలకంగా మారాయి. ప్రభుత్వం పలు కీలక పథకాలను ఉదాహరణకు ఉజ్వల యోజన, ఆరోగ్య మిషన్ వంటి వాటిని గణాంక ఆధారంగా లక్ష్యంగా మలచగలిగింది. దీనివల్ల సమర్థవంతమైన సేవల అందుబాటు సాధ్యమైంది. ఈ సంస్థ అప్లయిడ్ స్టాటిస్టిక్స్, బయోస్టాటిస్టిక్స్, ఎకనోమెట్రిక్స్, కంప్యూటర్ సైన్స్ వంటి రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహిస్తోంది. యునెస్కో, ఐక్యరాజ్య సమితి వంటి సంస్థలకు ఐఎస్ఐ వితరణలూ, సూచనలూ ముఖ్యమవుతున్నాయి.

భారతదేశంలో అనేక విశ్వవిద్యాలయాలు గణాంక విద్యను అందిస్తున్నాయి. ఐఐటి, ఐఐఎస్‌సి, ఐఎస్ఐ వంటి సంస్థలలో గణాంకంలో అగ్రశ్రేణి విద్య, పరిశోధన జరుగుతోంది. డేటా అనాలిటిక్స్, ఆప్టిమైజేషన్ వంటి కోర్సులు ద్వారా యువతకు ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. గణాంకం ం కంప్యూటర్ సైన్స్ అనేది ప్రస్తుత కాలంలో శక్తివంతమైన కలయికగా నిలుస్తోంది. 2025 సంవత్సరానికి 'గణాంకాల ద్వారా సమగ్ర అభివృద్ధి' అనే అంశం గణాంక దినోత్సవం థీమ్‌గా తీసుకోవడం, ప్రగతి సాధనలో గణాంకాల కీలకతను గుర్తించడంలో ఒక ముఖ్య సూచన. ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, స్త్రీ-పురుష సమానత్వం వంటి రంగాల్లో గణాంకాలు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ గణాంక దినోత్సవం ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. సమాజాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకునే శక్తి గణాంకాల్లో ఉంది. ప్రతి డేటా సూత్రం ఒక పరిశోధనకు ద్వారం, ప్రతి విశ్లేషణ ఒకసమాజాన్ని మెరుగుపరచే అవకాశం. గణాంకాల మౌలికతను మనం గుర్తించినప్పుడే నిజమైన ప్రజాసంక్షేమ ప్రణాళికలు పుడతాయి. అలాంటి గణన దిశలో మహాలనోబిస్ లాంటి మహనీయులను స్మరించుకుంటూ నిజమైన గణాంక విజ్ఞానంతో ముందుకు సాగడం ఈ దినోత్సవ అసలైన శుభార్ధం.

# కృష్ణమ్మ పరవళ్లు - నిండుకుండలా శ్రీశైలం జలాశయం

**నేడు శ్రీశైలం గేట్లు ఎత్తివేసే అవకాశం**

**జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం**

**కర్నాటక, మహారాష్ట్రలో కుండపోత వానలు**

**ఆల్మట్టి నుంచి జూరాలమీదుగా వరదపోటు**

**ప్రస్తుతం జల విద్యుత్ కోసమే నీటి విడుదల**



అమరావతి జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా నదికి పెద్ద ఎత్తున వరద పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు తరలివస్తోంది. 15 రోజులుగా ఏగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదలతో జలాశయం నిండుకుండలా మారింది. సోమవారం శ్రీశైలం ప్రాజెక్టు ఇన్ ఫ్లో 1,56,554 క్యూసెక్కులుగా కొనసాగుతుంది. ఇంతవరకు అవుట్ ఫ్లో లేదు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు జలాశయం 872.50 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్ధాయి నీటినిల్వ 215.7080 టీఎంసీలుకాగా ప్రస్తుతం 152.4941 టీఎంసీలుగా ఉంది. ఇక కేవలం 12.50 అడుగులు మాత్రమే జలాశయం నిండటానికి తక్కువగా ఉంది. ఈ నీరు జలాశయంలోకి వస్తే నేడో రేపో గేట్లెత్తే అవకాశం ఉన్నట్టు అధికారి వర్గాలు తెలిపాయి.

**కర్నాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు..**

ఏగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్నాటకలో కురుస్తున్న వర్షాలతో తుంగభద్రా నది పొంగి పొర్లుతుంది. ఆల్మట్టి డ్యామ్ నుంచి జూరాల ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద వస్తోంది. ఇక.. శ్రీశైలం జలాశయంలోకి 1,56,554 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులైన జూరాల నుంచి 26,072 క్యూసెక్కులు, స్పిల్ వే నుంచి 1,30,482 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. సుంకేసుల హంద్రీనీవా నుంచి నీరు విడుదల కాలేదు. ఇంతవరకు విద్యుత్ ఉత్పత్తికి సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విద్యుత్ ఉత్పత్తికి 621 క్యూసెక్కుల నీటిని.. తెలంగాణకు 6904 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్టు అధికారులు తెలిపారు..

## కెమికల్ ఫ్యాక్టరీలో.. భారీ పేలుడు

తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య 16కు పెరిగింది. ప్రమాదస్థలంలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతుండగా.. శిథిలాల కింద మరో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. స్పాట్ లో 8 మంది చనిపోగా, వికిత్స పొందుతూ మరో ఆరుగురు మృత్యు వాత పడ్డారు. మరో ఇద్దరు కూలిన భవన శిథిలాలు కింద కన్నుమూశారు. మరో 35 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉందని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. కాగా ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో మరో12 మంది పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి మూడంస్తుల భవనం కుప్పకూలగా.. శిథిలాల్లో మరికొందరు చిక్కుకొని ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఘటన జరిగిన సమయంలో ఫ్యాక్టరీలో దాదాపు 108 మంది కార్మికులు ఉన్నారని సమాచారం. గాయపడ్డ కార్మికుల్లో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. కార్మికులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ పేలుడులో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ సైతం మృతి చెందారు. ఆయన ప్లాట్‌లోకి వచ్చిన సమయంలోనే రియాక్టర్ పేలుడు సంభవించినట్లు తెలుస్తున్నది. ప్రమాదం ధాటికి ఆయన కారు పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద స్థలాన్ని మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ పరిశీలించారు.పరిశ్రమల్లో భద్రతపై త్వరలోనే ఓ కమిటీ వేస్తామని మంత్రి వివేక్ పేర్కొన్నారు. అధికంగా పని గంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేరస్తుందని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఈ ఘటన దురదృష్టకరమని.. ఘటన జరిగిన తర్వాత అధికారులంతా వేగంగా స్పందించారన్నారు. ప్రమాదానికి కారణాలు ఇప్పుడే ఏమీ చెప్పలేమన్నారు. కంపెనీలో మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే పౌడర్ తయారవుతోందని.. గత 40 ఏళ్లుగా సంస్థ పని చేస్తుందన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో సోమవారం రియాక్టర్ పేలుడు సంభవించింది. ఆ తర్వాత పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఫ్యాక్టరీలో ఉన్న కార్మికులు గాయపడ్డారు. తీవ్ర గాయాలతో ఐదుగురు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు చికిత్స పొందుతూ చనిపోయారు. పేలుడు ధాటికి కార్మికులు దాదాపు వంద మీటర్ల దూరం ఎగిరిపడ్డట్లు పలువురు తెలిపారు. పేలుడు ధాటికి భవనం కూలిపోగా.. మరో భవనానికి పగుళ్లు వచ్చాయి. ప్రస్తుతం సంఘటనా స్థలంలో ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, హైడ్రా సిబ్బందిని మోహరించారు.సంఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడులో పరిశ్రమ కార్మికుల అటెండెన్స్ రిజిస్టర్లు సైతం దగ్ధమయ్యాయని సమాచారం. రికార్డులు ధ్వంసం కావడంతో కార్మికుల హాజరు, వివరాలు అస్పష్టత నెలకొంది. వైస్ ప్రెసిడెంట్ మృతితో కార్మికుల గుర్తింపులో ఆలస్యం జరుగుతున్నది. పరిశ్రమలో అత్యధికులు బిహార్, ఒడిశాకు చెందిన వారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. ముగ్గురు కాంట్రాక్టర్ల ద్వారా రోజువారీ పనులకు కార్మికులు వస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం పరిశ్రమ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంఘటనా స్థలానికి కార్మికుల కుటుంబ సభ్యులు చేరుకున్నారు. తమ వారి ఆచూకీ చెప్పాలంటూ కార్మికుల కుటుంబాలు ఆందోళన చేస్తున్నాయి.పరిశ్రమలోకి చొచ్చుకు వెళ్లేందుకు కుటుంబాలు యత్నించగా.. పోలీసులు అడ్డుకొని వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికుల కుటుంబీకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. మరో వైపు ఫ్యాక్టరీ వద్ద కార్మికుల కుటుంబాల రోదనలు మిన్నంటాయి.

**మెరుగైన వైద్యం అందేలా చూడండి,,,గవర్నర్ ఆదేశం**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటన పట్ల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ ద్వారా ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన సంతాపాన్ని వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.

**కేసీఆర్ దిగ్భ్రాంతి**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటనపై మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిగాచి పరిశ్రమలో 14 మంది కార్మికుల మృతిపట్ల సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలని ఆదుకోవాలన్నారు.

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేం: కేంద్ర కమిటీ

తీర్పును పరిశీలించవలసి ఉంటుందని తెలిపింది. పర్యావరణ అనుమతుల కోసం సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ)ని సంప్రదించడం అత్యవసరమని సూచించింది. బనకచర్ల ప్రాజెక్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నివేదికను నిపుణుల కమిటీ పరిశీలించింది. అయితే, 1983లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని అభిప్రాయపడింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వలపై కేంద్రం అధ్యయనం చేయాలని, రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలకు అన్ని అనుమతులు పొందాలని, పర్యావరణంపై ప్రభావం అంచనా వేసిన తర్వాతే ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతి ఇవ్వడానికి వీలవుతుందని నిపుణుల కమిటీ పేర్కొంది.

## ప్రధాని మోదీ విదేశీ పర్యటన..

ప్రధాని మోదీ తన పర్యటనను జులై 2న ఆఫ్రికా దేశం ఘనాతో ప్రారంభిస్తారు. జులై 3 వరకు అక్కడే ఉంటారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆర్థికం, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చిస్తారు. అనంతరం జులై 3, 4 తేదీల్లో కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోలో పర్యటిస్తారు. 1999 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం కూడా ఇదే ప్రథమం.

**అర్జెంటీనాతో వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు**

అక్కడి నుంచి ప్రధాని నేరుగా దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాకు వెళ్తారు. జులై 4, 5 తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో మోదీ విస్తృతంగా చర్చిస్తారు. రక్షణ, వ్యవసాయం, మైనింగ్, చమురు, గ్యాస్, పునరుత్పాదక ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై ఇరువురు నేతలు దృష్టి సారిస్తారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

**బ్రిక్స్ సదస్సులో కీలకోపన్యాసం**

అర్జెంటీనా పర్యటన ముగిశాక, ప్రధాని మోదీ జులై 5 నుంచి 8వ తేదీ వరకు బ్రెజిల్‌లో పర్యటిస్తారు. రియో డి జనీరో వేదికగా జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ సదస్సులో ప్రపంచ పాలనా సంస్కరణలు, శాంతి భద్రతలు, కృత్రిమ మేధస్సు వినియోగం, వాతావరణ మార్పులు, ప్రపంచ ఆరోగ్యం, ఆర్థిక అంశాలపై ప్రధాని తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు సందర్భంగా పలు దేశాధినేతలతో కూడా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. చివరగా, జులై 9న నమీబియాకు చేరుకుని ఆ దేశంతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ప్రధాని నమీబియా పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కూడా ఉందని సమాచారం.

## అమరావతిలో క్వాంటమ్ పార్క్

ఎదుగుతుందని తాను ఆనాడే చెప్పానని అన్నారు.

**ప్రపంచస్థాయి నగరంగా అమరావతి..**

అమరావతిని కేవలం పరిపాలనా నగరంగానే కాకుండా, ప్రపంచ స్థాయి సాంకేతిక కేంద్రంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "రాజధాని ప్రాంతానికి ఇప్పటికే అనేక ఐటీ సంస్థలు తరలివస్తున్నాయి. ముఖ్యంగా క్వాంటమ్ టెక్నాలజీపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. యువత, నూతన ఆవిష్కరణలతో ముందుకు వచ్చే స్టార్టప్ కంపెనీలను అమరావతికి రావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం" అని ఆయన వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సాంకేతికతను ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగించుకుంటామని చంద్రబాబు తెలిపారు.

## బీజేపీకి రాజాసింగ్ రాజీనామా

ఎన్నో కష్టాలు పడ్డానని, పార్టీ కోసమే తాను ఉగ్రవాదులకు టార్గెట్ గా మారానని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, గత కొంతకాలంగా రాజాసింగ్ సొంత పార్టీ నేతల వైఖరిపై అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. పలు సందర్భాల్లో ఆయన నాయకత్వంపై పరోక్షంగా విమర్శలు చేశారు. తాజా పరిణామంతో తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడినట్లయింది.

## అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీగా అభివృద్ధి చేస్తాం..

కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ వర్క్ షాప్ నకు హాజరైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, విద్యారంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఇతర అధికారులకు స్వాగతం. అమరావతి వర్క్ షాప్-2025కు మిమ్మల్ని స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. ఇవాళ ఈ సమావేశం దేశంలో అత్యుత్తమ క్వాంటమ్ మేధావుల సమావేశం మాత్రమే కాదు. దేశంలో ఓ కీలక మలుపు కానుంది. భవిష్యత్ లో రాబోయే సాంకేతిక విప్లవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు నేతృత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నారనే సంకేతాన్ని ఇస్తోంది.

**అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీగా మారుస్తాం**

అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీగా మార్చాలనేది మా లక్ష్యం. ఇక్కడ ఆలోచనలు ఆవిష్కరణలుగా, ఆవిష్కరణలు పరిశ్రమలుగా మారేలా ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఇది ఒకరోజు కార్యక్రమం కాదు. ఇది దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఉద్యమం. ఇందుకు ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా నిలవబోతోంది. క్యూబిట్ ఆర్కిటెక్చర్ నుంచి క్రయో ఎలక్ట్రానిక్స్ వరకు, ఆల్గోరిథం అభివృద్ధి నుంచి అంతర్జాతీయ క్వాంటమ్ ప్రమాణాల వరకు మేం పూర్తిస్థాయిలో క్వాంటమ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తాం. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన 156 క్యూబిట్లను కలిగిన ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్-2 త్వరలోనే అమరావతిలో అందుబాటులోకి రానుంది. ఇది చాలా గర్వించదగ్గ విషయం. ఆసియాలో మొట్టమొదటి క్వాంటమ్ ప్రమాణాల టెస్ట్‌బెడ్‌ను ఎన్పీఎల్, ఐఈఈఈ, సీయాక్, ఏడబ్ల్యూఎస్ భాగస్వామ్యంతో ఏర్పాటుచేయడం జరుగుతుంది. ఐబీఎం, టీసీఎస్, హెచ్ సీఎల్, టెక్ మహీంద్ర వంటి అగ్రగామి సంస్థల సహకారంతో క్వాంటమ్ స్టారప్ ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. ఈ కార్యాచరణకు వ్యూహాత్మక దూరదృష్టి ఉంది. ఇది ప్రధాని మోదీ గారు ప్రకటించిన జాతీయ క్వాంటమ్ మిషన్ కు అనుసంధానంగా, గ్లోబల్ భాగస్వామ్యాలతో నిర్మించడం జరుగుతుంది. ఐఐటీలు, ఐఐఎస్, టోక్యో యూనివర్సిటీల సహకారం తీసుకోవడం జరుగుతుంది.

**చంద్రబాబు గారి సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ. చంద్రబాబు గారు మొదటి చాప్టర్ ఐటీ అన్నప్పుడు నేను ఏడో తరగతి చదువుతున్నాను. దక్షిణాసియా క్వాంటమ్ కేంద్రంగా అమరావతి అభివృద్ధి చెందుతుంది. సాఫ్ట్ వేర్ రంగానికి సిలికాన్ వ్యాలీగా అమరావతి క్యాంటమ్ వ్యాలీ అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు గారి విజన్ సాధనకు అనుగుణంగా పనిచేస్తూ ప్రపంచపటంలో అమరావతి క్యాంటమ్ కు చోటు దక్కేలా కృషిచేద్దాం.

**ఏపీ బ్రెయిన్ క్యాపిటల్ గా మారుతుంది**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి లాంటి నాయకుడు ఉండటం మన అదృష్టం. విజన్ అంటే ఇప్పుడు వెలాసిటీ, ఇన్నోవేషన్. గ్లోబల్ రేస్ లో చేరడం కాదు.. మనమే దారిచూపాలి. ఫలితంగా ఏపీ బ్రెయిన్ క్యాపిటల్ గా మారుతుంది. క్వాంటమ్ సైన్స్ ను ఇంజనీరింగ్ లోనూ భాగం చేస్తున్నాం. అమరావతిని క్యాంటమ్ టెక్నాలజీలకు కేంద్రంగా మారుస్తాం. ఇన్నోవేటివ్, స్టార్టప్ లకు ఈ క్యాంటమ్ వ్యాలీ పార్క్ ఓ లాంచ్ ప్యాడ్ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సందీప్ పటేల్, ఐబీఎం క్వాంటమ్ అడాప్షన్ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రోడర్, టీసీఎస్ టెక్నాలజీ, స్టాఫ్ట్ వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న, ఎల్ అండ్ టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, అడ్వైజర్ ఎంవీ సతీష్, ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కే.మధుమూర్తి, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోఠి, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడల విజేతలకు ఏపీ ప్రభుత్వం భారీ నగదు ప్రోత్సాహకాలు

విజేతలుగా నిలిచిన 15 మంది ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు ఈ నగదు బహుమతి అందనుంది. రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) సంయుక్తంగా ఈ నిధులను మంజూరు చేశాయి. క్రీడాకారులలో స్ఫూర్తిని నింపడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న విషయం తెలిసిందే. జాతీయ, అంతర్జాతీయ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా యువతను క్రీడల వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తోంది. తాజాగా ప్రకటించిన ఈ నజరానాతో క్రీడాకారుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది.

## ఏపీ, తెలంగాణ బీజేపీ అధ్యక్షులుగా మాధవన్, రామచంద్రరావు

చలపతి రావు సీనియర్ బీజేపీ నేత. గతంలో ఆరేళ్లపాటు ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. మాధవ్ బీసీ నేత కావడం మరో కారణం. అన్నిటికీ మించి సౌమ్యుడు. రాజకీయ వివాదాలకు దూరంగా ఉంటారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఆ పార్టీలతో కూడా సమన్వయం చాలా అవసరం.

**తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్. రామచంద్ర రావు**

తెలంగాణలో బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, ఎం. రఘునందన్ రావు వంటి పలువురు నాయకులు పోటీలో ఉన్నారు. అయితే, పార్టీ ఎన్. రామచంద్ర రావును ఎంపిక చేసింది. రామచంద్ర రావు ఆరెస్సెస్ నేపథ్యం కలిగిన నాయకుడు. ఆయన ఎబివిపిలో చురుకైన పాత్ర పోషించారు. బీజేపీలో సుదీర్ఘ అనుభవం కలిగిన నేత. రాష్ట్ర రాజకీయాలపై లోతైన అవగాహన ఉంది. పార్టీ కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలున్నాయి. పైగా సౌమ్యుడు. అందరినీ కలుపుకు పోగలరు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
జులై 01,
మంగళవారం 2025



## భక్తి శ్రద్ధలతో గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

**-పుష్కరాల రేవు మున్సిపల్ హైస్కూలు 1975-76 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక**



**రాజమహేంద్రవరం, జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** గోదావరి పుష్కరాల రేవు పక్కన ఉండే అలనాటి మున్సిపల్ హైస్కూలు 1975-76 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక గౌతమఘాట్ లోని టీచర్స్ అసోసియేషన్ హాలులో సందడిగా సరదాగా జరిగింది. పూర్వవిద్యార్థులు లక్కోజు వీరభద్రరావు (లక్కోజి), ఎ.ఎన్.వి.ప్రసాదు తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు భక్తి శ్రద్ధలతో పాదాభివందనం చేసి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. టీచర్స్ శ్రీమతి బి.కె.డి.స్ధరాజ్యలక్ష్మి, విశ్వనాథ భవానీ శంకరం, గొర్రెల వెంకట రామకృష్ణ, శ్రీమతి రుక్మాబాయిలను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. వివిధ నగరాలు, పట్టణాల్లో స్థిరపడిన 45 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థులు లక్కోజీ, ఎ.ఎన్.వి.ప్రసాద్, పి.రాము, నీలం శ్రీనివాస్, కత్తుల పెరుమాళ్ళరాజు, పుట్రేవు ప్రసాద్, కొల్లూరి ప్రసాదు, గట్టుపల్లి సత్యనారాయణ, బోడా వి ఆనంద్, రమణ పర్యవేక్షణలో ఉత్సాహంగా జరిగింది.

## జులై 6న రాజమండ్రిలో రజక ఆకాంక్ష సభ



**రాజమహేంద్రవరం,జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రాజమండ్రి పట్టణ రజక సేవా సంఘ%శ్రీ% ఆధ్వర్యంలో జులై 6వ తేదీన స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రజక ఆకాంక్ష సభ నిర్వహిస్తునట్లు రజక సేవా సంఘ అధ్యక్షులు బొమ్మదేవర శ్రీనివాస్, పొలామూరి వెంకట్రావు తెలిపారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర రజక ఫెడరేషన్ చైర్ పర్సన్ సావిత్రి, డైరెక్టర్లు హాజరవుతున్నారని తెలిపారు. రజక నాయకులు, రజక సోదర సోదరిమణులంతా విచ్చేసి ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లూరి వెంకటేశ్వరరావు, అంత్రర్వేది ప్రభాకర్, వి.నూకరాజు, రజక ఫెడరేషన్ చైర్మన్ డైరెక్టర్ చింతపల్లి సతీష్, పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

## మహా టీవీపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి



**జగ్గయ్యపేట, జూన్ 30 (తెలుగురాష్ట్రం విలేకరి):** జగ్గయ్యపేట ప్రెస్ క్లబ్ పాత్రికేయులు హైదరాబాదులో మహా టీవీ ప్రధాన కార్యాలయంపై శనివారం జరిగిన దాడిని నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ కు, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సిఐ కు వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఏపీడబ్ల్యూజే నాయకుడు ముత్యాల సైదేశ్వర రావు, సీనియర్ పాత్రికేయులు టిఎల్ఎన్ ఆచార్యులు మూర్తి, యలదండి శ్రీనివాసరావు, జగ్గయ్యపేట ప్రెస్ క్లబ్ అడహాక్ కమిటీ సభ్యులు అల్లి రవిచంద్, మైలా విజయపాల్, ఎస్. శ్రీనివాసరావు, డి. రామకృష్ణ, ప్రెస్ క్లబ్ సభ్యులు ఎస్కె నజీర్ మీరా, చింత శ్రీనివాసరావు, మాసెట్టి రమేష్ బాబు, శివాజీ, కే ఎల్ ఎన్ ప్రసాద్, ఆనంద్, జై వెంకట్రావు, వి ఎస్ ఎల్ ప్రభాకర్, ఆశీర్వాదం, సిహెచ్ రమేష్, రమణారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**-సభాస్థలిని పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్-వాతావరణం దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని సూచన**



**రాజమహేంద్రవరం, జూన్ 30 (తెలుగురాష్ట్రం విలేకరి):** జూల్కై 1వ తేదీన కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ సభా ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చినరాముడు, రాజమండ్రి ఆర్డీవో ఆర్ . కృష్ణనాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, అదనపు ఎస్పీ ఎన్బిఎం మురళీకృష్ణ, డీఎస్పీ జి దేవకుమార్ తదితర జిల్లా పోలీస్ యంత్రాంగంతో ఏర్పాట్లపై మంత్రి కందుల దుర్గేష్ సమీక్షా నిర్వహించారు. అనంతరం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు, స్థానిక కూటమి నాయకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించాలని, కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేయాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. సమర్థవంతమైన భద్రతా ఏర్పాట్లు,హెలిప్యాడ్, రూట్ మ్యాప్, ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతనం నెలకొన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లుపై దృష్టి పెట్టాలని సూచించారు

## పిజిఆర్ఎస్ లో అందిన అర్జీల పరిష్కారం అర్ధవంతంగా ఉండాలి.

**-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.**



**ఏలూరు,జూన్,30, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో(పిజిఆర్ఎస్) లో అందిన అర్జీల పరిష్కారం నాణ్యతతో అర్ధవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొని ప్రజల నుంచి 302 అర్జీలను స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ వారితో పాటు జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. భాస్కర్, ఏస్సీ కార్పోరేషన్ ఈడి ఎం. ముక్కంటి ఉన్నారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో అర్జీదారులను నుండి స్వీకరించిన ప్రతి అర్జీ పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతతో పనిచేయాలన్నారు. అందిన అర్జీల పరిష్కారతీరు నాణ్యతతో ఉండాలని, రీఓపెనింగ్ అయ్యేందుకు ఆస్కారం లేకుండా ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీలు అర్ధవంతంగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. అందిన అర్జీలలో కొన్ని..చింతలపూడి మండలం అల్లిపల్లి గ్రామానికి చెందిన చక్రపు విజయ అర్జీనిస్తూ దస్తావేజులో పేరు తప్పుగా నమోదు కాబడిందని, సదరు పేరు సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉంగుటూరు మండలం కాకర్లమూడి తోటరామచంద్రాపురం కు చెందిన యడవల్లి జగ్గయ్య అర్జీనిస్తూ వ్యవసాయ భూమిపక్కన చెరువులు త్రవ్వడం వల్ల వారు ఎటువంటి బోదులు త్రవ్వకుండా ఆ చెరువుల నీరు తమ పొలాల్లోకి వచ్చి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని ఈ సమస్యకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జంగారెడ్డిగూడెం కు చెందిన కె. సత్యనారాయణరెడ్డి అర్జీనిస్తూ రద్దుపరిచిన వీలునామాపై చేసిన మ్యూటేషన్ రద్దుపరిచి సాగుచేస్తున్న తమ భూమికి మ్యూటేషన్ చేయాలని కోరారు. పోలవరంకు చెందిన బత్తుల రత్నకుమార్ అర్జీనిస్తూ విద్యుత్ ఘాతంతో పాడిగెదే చనిపోయిన కారణంగా విద్యుత్ శాఖ నుంచి నష్టపరిహారం ఇప్పించవలసిందిగా కోరారు. ఏలూరుకు చెందిన మహ్మద్ అబ్దుల్ అజీమ్ ఎం.ఎ.కె.ఎ. ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న దృష్ట్యా వెంటనే టీచర్లను నియమించాలని కోరారు. టి. నర్సాపురం కు చెందిన ఎ. విజయలక్ష్మి అర్జీనీస్తూ టి. నర్సాపురం నుండి బొర్రంపాలెం వెళ్లే రహదారిలో ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టల్ శాఖ పార్సెల్ బిల్డింగ్ డెలివరీ సెంటర్ ను ప్రారంభించిన తపాలా సూపర్డెంట్ సురకత్తుల శ్రీకర్ బాబు

**ఏలూరు,జూన్,30 (తెలుగురాష్ట్రం విలేకరి):**



ఏలూరు ఆర్.ఆర్. పేట, పోస్టల్ శాఖ వారి పార్సెల్ హబ్ బిల్డింగు నందు ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్ ఐడిసి ను ఏలూరు తపాలా సూపరింటెండెంట్ సురకత్తుల శ్రీకర్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐడిసి ఏర్పాటు ద్వారా ఏలూరు పట్టణంలోని అయిదు తపాలా కార్యాలయాలు అనగా ఏలూరు పెద్ద పోస్ట్ ఆఫీస్, వెంకటరావు పేట, నరసింహారావు పేట, ఏలూరు రైల్వే స్టేషన్ మరియు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నందు గల పోస్ట్ మాన్ సిబ్బంది ఒకే కేంద్రం నుండి ఉత్తరాల బట్వాడా చేయనున్నారు. ఈ ఐడిసి ద్వారా ఉత్తరాల బట్వాడా వేగవంతం మరియు మెరుగైన సేవలు ప్రజలకు అందించే లక్ష్యంతో పోస్ట్ మాన్ సిబ్బందికి మోటార్ బైకుల మీద వెళ్ళే వెసులుబాటు కల్పించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఈ ఐడిసి లో ఆదివారం మరియు సెలవు దినములలో ఉత్తరాల బట్వాడా జరిగే విధంగా తగు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రజలందరూ ఈ కొత్త తరహ డెలివరీ విధానం యొక్క ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏలూరు అసిస్టెంట్ తపాలా సూపరింటెండెంట్ డి. శ్రీనివాస రావు, పోస్టల్ ఇన్స్పెక్టర్ యు. చంద్ర శేఖర్, ఐడిసి ఇంచార్జ్ ఎం. శ్రీనివాస రావు మరియు ఏలూరు టౌన్ నందరి ఇతర పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లు పై నాయకులుతో ఎమ్మెల్యే ముప్పిడి సమీక్ష



**తాళ్ళపూడి,జూన్ 30(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మొట్ట మొదటిసారిగా కొవ్వూరు నియజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామానికి రానున్న సందర్భం లో ఆయనను ఘనంగా ఆహ్వానించి, గౌరవంగా పంపాల్సిన బాధ్యత ఎన్డీయే కూటమి నాయకుల మీద ఉందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మలకపల్లి రానున్న సంధర్భంగా నియోజకవర్గం లోని కూటమి నాయకులు తో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి విషయం లో ఎవరికివారు కాకుండా సమస్యలుంటే ముందే చర్చించుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళదామన్నారు. మొదటిగా మలకపల్లి లో చర్మకారుల పించనును లబ్ధిదారు ఇంటికే వెళ్లి స్వయంగా అందచేస్తారని, అలాగే పి.4 కార్యక్రమాన్నీ గ్రామస్థులతో నిర్వహిస్తారని అనంతరం కాపవరం వద్ద కేవలం టీడీపీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఉంటుందని తెలిపారు. పార్టీ కార్యాలయం నుండి గుర్తించి మెస్సేజి పొందిన కార్యకర్తలు మాత్రమే హాజరు కావాల్సి వుందని పార్టీ గుర్తింపు కార్డులతో హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న పెద్దెవం గ్రామానిక్గంగాధరం అనే రైతు మాట్లాడుతూ సరఫరా చేసిన ధాన్యం డబ్బు లు చెల్లించటం లేదని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు

## ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లను నూరుశాతం ఇంటివద్దే ఇవ్వాలి.

**-జూలై మాసపు పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం.- జిల్లాలో 2,58,098 మంది ఫించన్ దారులకు రూ. 112.73 కోట్లు.-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.**


**ఏలూరు,జూన్,30, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**



ప్రతినిధిరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్.టి.ఆర్. భరోసాపింఛన్ల పంపిణీ లబ్దిదారుల ఇంటివద్దనే నూరుశాతం జరగాలని, పంపిణీలో ఏవిధమైన సమస్యలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను, సిబ్బందిని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలో జులై నెల ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్ల చెల్లింపులు జూలై 1వ తేదీ మంగళవారం ఉదయం 7.00 గంటల నుంచి ప్రారంభించాలన్నారు. జిల్లా లో జులై నెలలో 2,58,098 మందికి పెన్షన్ల పంపిణీకి రూ. 112.73 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మొదటి రోజునే నూరుశాతం పెన్షన్ల పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనివార్య కారణాలచేత జూలై1 వ తేదీన తీసుకోని వారికి జూలై 2 వ తేదీ న పంపిణీ చేయాలన్నారు. జిల్లా లో 5275 మంధి సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బంది తో ఫించనల పంపిణీకి ఏర్పాటు చేయడమైనదన్నారు. సంబంధిత సిబ్బంది ద్వారా జూలై 1వ తేదీ 7 గంటల నుండి ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్ల పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్డిఏ పిడిని కలెక్టర్ ఆదేశించారు. పింఛను పొందేందుకు పింఛను దారులు వారి సంబంధిత ఇళ్లలో అందుబాటులో ఉండేలా ముందస్తు సమాచారం అంధించడం జరిగిందన్నారు.

# కోనేరు మురళికి పుత్ర వియోగం

**-ఘనంగా అంతిమ యాత్ర అంత్యక్రియలు పూర్తి**



**రాజమహేంద్రవరం, జూన్ 30(తెలుగురాష్ట్రం విలేకరి):** నగర ప్రముఖులు, టీడీపీ నాయకుడు కోనేరు మురళీ కృష్ణ సాయి(కోనేరు మురళి)కి పుత్రం వియోగం కలిగింది. ఆయన తనయుడు సుస్మంత్ వెంకట్ (26) సోమవారం ఉదయం అకస్మికంగా మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుస్మంత్ వెంకట్‌కు హైదరాబాద్, రాజమండ్రిలలో గత కొంత కాలంగా వైద్యం అందించారు. అయితే సోమవారం అనారోగ్యం పరిస్థితి విషమించడంతో మృతి చెందిన సుమంత్ వెంకట్ అంత్యక్రియలు రాజమండ్రి కోటిలింగాల కైలసభూమిలో ఘనంగా జరిగాయి. అయితే ముందుగా కోనేరు మురళి నివాసం నుంచి కైలాసరథంలో కోటి లింగాల ఘాట్ వరకు సుస్మంత్ వెంకట్ భౌతికకాయాన్ని తీసుకుని భారీ స్థాయిలో అంతిమ యాత్ర నిర్వహించారు. వేలాది మంది అభిమానులు ఊరేగింపుగా తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సమాచారం తెలియగానే పలువురు ప్రముఖులు, మిత్రులు, అభిమానులు మురళీ నివాసానికి చేరుకుని సుస్మంత్ వెంకట్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కోనేరు మురళిని పరామర్శించి ధ్కెర్యం చెప్పారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎస్సీ కమిషన్ చెర్మన్ కెఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్సీ అదిరెడ్డి అప్పారావు, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, వైసీపీ యువజన నాయకుడు జక్కంపూడి గణేష్, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రిఘాకుళపు శివరామ సుబ్రహ్మణ్యం, పంతం కొండల రావు, టిటిడి బోర్డు మెంబర్ అక్కిన ముని కోటేశ్వరరావు, తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమల రావు, టీడీపీ హెల్త్ వింగ్ గోరంట్ల రవి రామ్ కిరణ్, టిడిపి నాయకులు కాశీ నవీన్ కుమార్, రెడ్డి మంగేశ్వరరావు, వాసిరెడ్డి బాబి, నున్న కృష్ణ, బొల్లినేని హాస్పిటల్ సీఈఓ రామ్మోహన్ రావు తదితరులు కోనేరు నివాసానికి చేరుకుని సుస్మంత్ వెంకట్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని అనేకమంది మురళిని కలిసి ఓదార్చి పరామర్శించారు.








తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
మంగళవారం 01 జులై 2025

# అలింకో దివ్యాంగులకు ఉపకరణాల వరం

**-కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్.-దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం. -ఎమ్మెల్యే బండారు.- రావులపాలెంలో రూ.68 లక్షల విలువైన 630 పరికరాలు 417 మందికి పంపిణీ.**





రావులపాలెం, జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వికలాంగులు సమాజంలో స్వాభిమానంగా జీవించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని ఉపకరణాలు అందిస్తున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం రావులపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు కృత్రిమ ఉపకరణాలు పంపిణీ చేశారు. జిల్లాకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 417 మంది దివ్యాంగులకు రూ.68 లక్షల విలువైన 630 పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆల్ఇంకో) ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర సామాజిక న్యాయ శాఖ ఆధ్వర్యంలో ఈ సంస్థ దివ్యాంగుల సాధికారత కోసం పనిచేస్తోంది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూపరిషత్ పరిధిలో దివ్యాంగుల కోసం గత ఏడాది నవంబర్లో ఆలింకో సంస్థ వైద్య శిబిరాలు నిర్వహించింది. అర్హులను గుర్తించి, అవసరమైన వారికి ఉపకరణాల పంపిణీకి చర్యలు తీసుకుంది. రూ.4 కోట్ల ప్రాజెక్టులో భాగంగా కొత్తపేట నియోజకవర్గానికి రూ.68.21 లక్షలు కేటాయించి, వాటితో 630 పరికరాలను అందించాం అని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధిని ప్రోత్సహించే విధంగా పలు పథకాలు అమలు చేస్తోంది. ఈ తరహా కార్యక్రమాలు వారి జీవన ప్రమాణాన్ని మెరుగు పరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో) దివ్యాంగుల పాలిట వరం అన్నారు. ఈ సందర్భంగా పంపిణీ చేసిన పరికరాల్లో బ్యాటరీ ఆపరేటెడ్ మోటార్ సైకిళ్లు -101, ట్రై సైకిళ్లు -59, వీల్ చైర్లు -69, నడక కర్రలు -65, ఇతర కృత్రిమ అవయవాలు, సహాయ పరికరాలు-336. పరికరాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఇంటికే పరిమితమైన జీవితం, ఇప్పుడు వీల్‌చైర్ తో స్వేచ్ఛగా బయటకు వెళ్ళగలగడం కొత్త జీవితం లాంటిదే అని ఒక లబ్ధిదారుడు చెప్పారు. ఆల్ఇంకో సంస్థ శారీరక, దృష్టి, వినికిడి లోపాలు, మేధో వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు అవసరమైన పరికరాలు, కృత్రిమ అవయవాలు ఉచితంగా అందిస్తోంది. వ్యక్తిగత రక్షణ కిట్లు, శిక్షణా సామగ్రి, ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు కూడా అందిస్తోంది. పిల్లలు, మహిళలు, వృద్ధులకు ప్రత్యేక శిక్షణలూ ఇవ్వడం ఈ సంస్థ ప్రత్యేకత. ఈ కార్యక్రమంలో ఆర్టీవో శ్రీకర్, తెదేపా పరిశీలకులు ఆకుల రామకృష్ణ, గౌడ్ సంఘం నాయకుడు అయినవిల్లి సత్తిబాబు, నాలుగు మండలాల కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ



కాట్రేనికోన, జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వారాహి నవరాత్రుల సందర్భంగా చింతలమెరకలోని శ్రీ విజయలక్ష్మి దుర్గాదేవికి ఆదివారం మహిళలచే సామూహిక కుంకుమ పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు ఆకొండి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పంచామృత అభిషేకం, కుంకుమ పూజ ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కుంకుమ పూజలో అధిక సంఖ్యలో భక్తులు మహిళలు పాల్గొన్ని అమ్మవారికి పూజలు చేసారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

## వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



కాట్రేనికోన, జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కాట్రేనికోన మండలం గచ్చ కాయల పోర లో మత్స్యకారుడు మూదే సుబ్బారావు ,వయస్సు 56 వేటకు వెళ్లి మృతి చెందాడు. రాత్రి 1గంటకు అల్లిపర్ర కు చేపలు వేటకు వెళ్లి తిరిగి రాక పోవడం తో పర్ర భూమి లో కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు గలింపు చర్యలు చేపట్టారు. పర్ర భూమి లో చేపల కోసం వల వేసి, చేతిలో వల తాడు తో పాటు, చేపల సంచి తో శవమై కనిపించడం తో కుటుంబ సభ్యులు బోరు న విల పిస్తున్నారు. ఈ యన కు భార్య లక్ష్మి తో పాటు ముగ్గురు అమ్మాయి లు, ఇద్దరు అబ్బాయి లు ఉన్నారు. సుబ్బారావు చేప ల వేటకు వెళ్లి ప్రమాదవ శాత్తు మృతి చెందడం పై పోలీసులకు, రెవిన్యూ అధికారులు, మత్స్య శాఖ అధికారులకు కుటుంబ సభ్యులు పిర్యాదు చేసారు.

## ప్రజలకు చేసిన సేవలే చిరకాల గుర్తింపునిస్తాయి: తాసిల్దార్ నరసింహారావు

**-వీఆర్వో మాచిరాజు వరప్రసాద్ ఉల్లిస్ కు ఘన సన్మానం.**



అల్లవరం, జూన్30(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అల్లవరం మండలం పలు గ్రామాలలో గ్రామ రెవెన్యూ అధికారిగా మాచిరాజు వరప్రసాద్ ఉల్లిస్ సుమారు 20 సంవత్సరాలనుండి ప్రజలకు సేవలు అందించి పదవి విరమణ సందర్భంగా మండల తహసీల్దార్ వి.వి ఎల్ నరసింహారావు, వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఉందుర్తి చిట్టిబాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ నరసింహారావు మాట్లాడుతూ ప్రజలకు ఉల్లిస్ చేసిన సేవలే ప్రజలలో మంచి గుర్తింపు ఇచ్చిందన్నారు. ఉల్లిస్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఒత్తిడికి గురికాకుండా తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి ఉన్నత అధికారుల మన్నలను పొందాలని ఆకాంక్షించారు. పూలమాలలు వేసి పుష్ప గుచ్చాలను అంధించి దుస్సాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఉల్లిస్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉత్తమ అవార్డు గ్రహీత అల్లవరం మండల తాసిల్దార్ వి వి ఎల్ నరసింహారావును పుష్ప గుచ్చాలని అందించి పూలమాలలు వేసి వీఆర్వో అసోసియేషన్ సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యాక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అడబాల సుబ్రహ్మణ్యం, ఆర్. ఐ కె. మన్యం, చింతా రత్నరాజు, సవరపు శ్రీనివాస్, గుత్తుల లిలంబా, బొంతు సతీష్ కుమార్, మెట్ల బాబ్జి, దాసరి రాజన్, ఆర్. వెంకటరెడ్డి, జి. నాగేంద్ర కుమార్, కాసు, డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల అచ్చియ్యానాయుడు, సిహెచ్ నాయకర్, బంగారయ్య, వీఆర్వో అసోసియేషన్ సభ్యులు, డీలర్ల అసోసియేషన్ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి: ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్

**-విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ**







అల్లవరం, జూన్ 30(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కానుక కిట్స్ పంపిణీలో భాగంగా సోమవారం అల్లవరం హైస్కూల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నయినాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన "యూనిఫామ్ డిస్ట్రిబ్యూషన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్, అల్లవరం ఎంపీపీ యిల్లా శేషగిరిరావు , జడ్పిటిసి కొనుకు గౌతమి మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి విద్యారంగం అభివృద్ధికి కృషి చేయాలని, విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందజేయాలని, అందుకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలియజేశారు. ఈ పాఠశాల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పనకు నా వంతు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొనుకు బాపూజీ, పాఠశాల ఎస్ఎంసి వైస్ చైర్మన్ చేట్ల అరుణ , బండిగుప్తాపు పాండురంగ , అడపా కృష్ణ, మామిడిశెట్టి శ్రీను , సుంకర సాయి , ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు రవాణా సంస్థ దుకాణాల్లో ఎంఆర్పీ పట్టికలు



అమలాపురం, జూన్ 30(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భముగా ఏపీఎస్ఆర్టీసీకి సంబంధించి బస్సు స్టేషన్లో ఉన్న దుకాణములలో ప్రయాణికులకు కనపడే విధంగా ఎం.ఆర్.పి ధరల పట్టిక ప్రతి దుకాణం వద్ద ఏర్పాటు చేయాలని, నాణ్యమైన పదార్థాలను మాత్రమే ఎం.ఆర్.పి మించకుండా అమ్మే విధముగా చర్యలు తీసుకోవాలని జిల్లాలోని అధికారులను ఎపిఎస్ ఆర్టిసి ఆర్. ఎం ఆదేశించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యము కలుగకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్.టి.పి రాఘవ కుమార్ జిల్లాలోని డిపో మేనేజర్లందరినీ ఆదేశించారు.

## వాడపల్లిలో కాటేజీల నిర్మాణానికి రూ.9.90 లక్షల విరాళం



ఆత్రేయపురం, జూన్ 30, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన వసతి గదుల ( కాటేజీ ) నిర్మాణానికి ఆదివారం విశాఖపట్నం కె.ఆర్.ఎం కాలనీకి చెందిన బలభద్రుని వెంకట నాగ సత్య సాయి సిరి అంజన, తల్లిదండ్రులు మాధవరావు, విజయలక్ష్మీ దంపతులు రూ. 9,90,000 విరాళంగా సమర్పించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సిబ్బంది, అర్చకులు దాతలకు వేదాశీర్వచనం చేసి, స్వామి వారి చిత్ర పటం అందజేసారు.

## ఎల్ఐసి క్రీడల్లో రావులపాలెం బ్రాంచ్ ప్రతిభ.

**-జోనల్ స్థాయికి ముగ్గురు ఎంపిక.-ఘనంగా సన్మానించిన స్పోర్ట్స్ క్లబ్.**



రావులపాలెం, జూన్ 30(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఎల్ఐసి వార్షిక క్రీడల పోటీల్లో రావులపాలెం బ్రాంచ్ ఉద్యోగులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఇటీవల రాజమండ్రి డివిజన్ స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ముగ్గురు ఉద్యోగులు అద్భుత ప్రదర్శన చేసి జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. చెస్ విభాగంలో కె.వరప్రసాద్రావు, 100 మీటర్ల పరుగులో కె.రాహుల్, వాలీబాల్ విభాగంలో టి.సురేష్ కుమార్ విజేతలుగా నిలిచారు. వీరంతా ఇప్పుడు బ్రాంచ్ తరపున జోనల్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎల్ఐసి రావులపాలెం కార్యాలయంలో ఎంప్లాయిస్ స్పోర్ట్స్ అండ్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎం.ఎన్. స్వామి నేతృత్వంలో విజేతలకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, డెవలప్మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు. ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాల వల్ల ఉద్యోగుల్లో ఉత్సాహం, పోటీతత్వం పెరుగుతాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

### భాష, సంస్కృతి - సంప్రదాయాలు భూమి పరిరక్షణలకు

# స్థానికులకు వంద శాతం రిజర్వేషన్ కల్పించాలి

## -ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్

**చింతూరు, జూన్ 30 (తెలుగు రాష్ట్రం విలేఖరి):**





మండల పరిధిలోని తులసిపాక గ్రామంలో విశ్వ కోయ - (గోండి ) భాషా దినోత్సవం సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో భాష సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలని నినాదాలు చేస్తూ విద్యార్థులు గ్రామస్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి శీలం కృష్ణ మాట్లాడుతూ 5వ షెడ్యూల్ భూభాగంలో భాష, సంస్కృతి - సంప్రదాయాలు భూమి పరిరక్షణకు స్థానిక ఆదివాసిలకు వంద శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే గౌరవ సుప్రీమ్ కోర్ట్ జీవో 3 ని పూర్తిగా కొట్టి వేయలేదనీ ఒక వేళ కొట్టి వేస్తే రివ్యూ పిటిషన్ వేసుకోవడానికి సంబందిత ప్రభుత్వాలకు సివిల్ తీర్పులో డిలేకన్డోన్ తో మల్లి సంబందిత డైలీ బెంచిలో వేసుకోండని సంబందిత ప్రభుత్వాలకు సుప్రీమ్ కోర్ట్ అనుమతి ఇచ్చింది. గత ప్రభుత్వం కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కానీ రివ్యూ పిటిషన్ వేయకుండా జీవో కొట్టి వేశారని ప్రచారం చేస్తూ ఆదివాసులను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఒక వేళ రివ్యూ పిటిషన్ సుప్రీమ్ కోర్టులో వేస్తే, తుది తీర్పు వచ్చే వరకు ప్రస్తుత 5 జడ్జిల బెంచ్ ఇచ్చిన తీర్పు అమలులోకి రాకుండా కేసు పెండింగ్లో ఉంటుందని కాబట్టి తుది తీర్పు వచ్చేలోపు 3 జీవో కూడా అమలులో వుంటుంది. అప్పుడు యదా విధిగా ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు కేవలం ఆదివాసులతో మాత్రమే భర్తీ చేసే అవకాశం వుంటుందని. ఈ విదంగా చేస్తే ఆదివాసులకి మల్లి ఏజెన్సీ ప్రాంతంపై పట్టు వస్తుందని కుట్రతో భవిష్యత్లో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర ప్రజల రాజకీయ మనుగడ, అదేవిదంగా వివిధ వ్యాపార రంగాలలో వారి భవిష్యత్ కూకటి వేళ్లతో సహా కదిలి వారి భవిష్యత్ ఏజెన్సీ ప్రాంతంలో చీకటి మాయం అవుతుంది. కాబట్టి ప్రస్తుత పాలక ప్రభుత్వం ఈ విషయాలన్నీ ముందుగానే ఊహించి రివ్యూ పిటిషన్ వేయకుండా కమిటీల పేరుతో ఆదివాసులను మోసం చేస్తున్నాయి. అంతే కాకుండా ఆదివాసులను అవమానించే విధంగా ఏకంగా మంత్రితో ప్రెస్ మీట్ పెట్టి 16 వేల పోస్టులకి గాను ఆదివాసులకి 2 వేల పోస్టు చాలవా. సుదీర్ఘ కాలంలో రాక రాక మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తే ఆదివాసి నిరుద్యోగులు వ్యతిరేకిస్తారా అని ప్రెస్ మీట్ పెట్టి వేలెత్తి చూపడంలో ఆదివాసుల పట్ల పాలక ప్రభుత్వ వైఖరి స్పష్టంగా అర్థమవుతుంది. ఇప్పుడైనా పాలక ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని అదేవిదంగా ప్రస్తుత మెగా డియస్సిలో గురుకుల, ఆశ్రమ బైలాస్ ప్రకారమే ఏజెన్సీ టీచర్ పోస్టు ఏజెన్సీ ప్రాంత ఆదివాసులతో మాత్రమే నింపాలని, అదే విదంగా గత వైఎస్సార్ ప్రభుత్వం కూడా మొన్నటి వరకు పార్లమెంట్లో 3 జీవో విషయం గురించి మాట్లాడి ఇప్పుడు ఎందుకు నోరు మూసుకొని వున్నది. ఇప్పుడైనా కళ్ళు తెరిచి పాలక ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రివ్యూ పిటిషన్ సుప్రీం కోర్టులో వేయించి ఆదివాసీ సమాజ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ కోరుతుంది. పోలవరం ప్రాజెక్టు వలన నష్టపోతున్న నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, ఆదివాసి పూజలకు గౌరవ వేతనం 10000 రూపాయలు చెల్లించాలని, జూలై 21న జరిగే కోయ భాషా విజయవంతం చేయాలని కోరారు. కోయ భాష, బాల సాహిత్యం పరిరక్షణకు ఐటిడిఏ ప్రత్యేక నిధులు కేటాయించి భాషను రక్షించాలని అలాగే విశ్వ కోయ - (గోండి) భాషా దినోత్సవ సందర్భంగా ప్రతి ఆశ్రమ పాఠశాలలో భాషా కు సంబంధించిన పద్యాలు వ్యాస రచనలు, ఆదివాసి పండుగలు గురించి విద్యార్థులకు పోటీలు , భాష దినోత్సవం నిర్వహించే విధంగా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లకు విజ్ఞప్తి చేశారు. భాషా సంస్కృతి - సంప్రదాయాలను గ్రామాలలో పరిరక్షిస్తున్న గ్రామ పూజారులు పటేళ్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అప్పుడు మాత్రమే భాష సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వాలు తోడ్పాటు అందించినట్లు అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో సోడే రాఘవయ్య, నూప నరేంద్ర, ఇరకం శ్రీరామ్, కట్టం సింగయ్య, రవ్వ దేవా, మడివి రవి, కుంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికార సాధనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకం కావాలి

## -దళితప్రజాశక్తి 10వ వార్షికోత్సవ దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో విశేష సేవలకు ఘన సన్మానాలు

**రాజమహేంద్రవరం, జూన్ 30 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**



రాజ్యాధికార సాధనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకం కావాలని మాజీ సైనిక ఉద్యోగాలు, ప్రముఖ రాజకీయ నాయకులు దాసి వెంకట్రావు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రం వద్ద గల అంబేద్కర్ భవనంలో దళిత ప్రజాశక్తి 10 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవా రత్న అవార్డుల మహోత్సవం సందర్భంగా దళిత ప్రజాశక్తి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మురారి రవికుమార్ అధ్యక్షతన దళిత ప్రజాశక్తి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సీనియర్ దళిత నేత అల్లు జయరాజ్ ను ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉభయగోదావరి జిల్లాల కమిటీలను ప్రకటిస్తూ సీనియర్ ఉద్యమ నేతలకు సీనియర్ జర్నలిస్టులకు స్వచ్ఛంద సంస్థల సేవా ప్రతినిధులకు సీనియర్ న్యాయవాదులకు విరామం ఉద్యోగులకు ప్రజా సేవకులకు వారి వారి సేవలను గుర్తించి విశిష్ట సేవారత్న అవార్డులను దళిత ఉద్యమనేత దాసి వెంకట్రావు చేతులమీదుగా నగర ప్రముఖుల చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన దాసి వెంకటరావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల సమస్యల పరిష్కారానికి దళిత ప్రజాశక్తి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దళిత ప్రజాశక్తి కి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. దళిత ప్రజాశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు మురారి రవికుమార్ మాట్లాడుతూ 2015 సంవత్సరాలో దళిత ప్రజాశక్తి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దగా పడిన తాడిత పీడిత ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి, వారికి న్యాయం జరిగే వరకూ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. అనపర్తి మండలం దోమాడ గ్రామంలో ఎస్సీ ఎస్టీ మైనార్టీలు గత 50 సంవత్సరాల కాలంగా నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. వారి గృహాలను పోలీసులు అధికారులు తొలగించారని అన్నారు. వారికి అండగా ఉండి పోరాటం చేసి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి సహకారంతో ఒక్కొక్కరికి 3 సెంట్లు భూమి, 4 లక్షల రూపాయలు అందించే వరకు న్యాయపోరాటం చేసినట్లు తెలిపారు. గత 30 సంవత్సరాలు కాలంగా దళిత ఉద్యమాలు చేసి ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు చెందిన ఆ నీకు సమస్యలు పరిష్కారం చేసినట్లు తెలిపారు. దళిత ప్రజాశక్తి 10వ వార్షికోత్సవ సందర్భంగా నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీ వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ మహమ్మద్ ఆరిఫ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అంబేద్కర్ భవనంలో దళిత ప్రజాశక్తి పదవ ఆవిర్భావ దినోత్సవం కుల మతాలకు అతీతంగా జరిగిందని తెలిపారు తాడిత పీడిత ప్రజలకు అండగా ఉంటూ ఎస్సీ,ఎస్టి, బీసీ, మైనార్టీ ప్రజల సమస్యల పరిష్కరిస్తు, నవభారత నిర్మాణానికి కృషి చేస్తున్నారని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆరే చిన్ని మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న దళిత ప్రజాశక్తి నాయకులకు అభినందనలు తెలిపారు. ఎల్లవేళలా వారి పోరాటానికి సహకరిస్తానని అన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి రాష్ట్ర నాయకులు దాసి వెంకట్రావు , స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజర్ దీయన తాగూర్,మాల బహుజన సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు ధారా సురేష్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు నల్ల చిన్నారావ్, ఆర్.పి.ఐ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్, బీఎస్పీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జుత్తుక నాగేశ్వరరావు,కోన లాజర్, జై భీమ్రావు పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జ్ వల్లూరి సత్యానందం, మాల మహానాడు రాజమండ్రి అధ్యక్షులు విజ్జన మధు,మాల మహానాడు యువజన విభాగం అధ్యక్షులు అరే రాము, దళిత నాయకుడు,మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గారా త్రినాద్,ఉల్లం నవీన్ కుమార్, గుమ్మడి శివకుమార్, గుడాల ప్రసాద్, రాష్ట్ర నాయకులు పల్లా ప్రకాష్ ,యువజన విభాగం నాయకులు మడికి ప్రసన్న కుమార్ ,స్టేట్ బిసి నాయకులు మార్గాని సుశీల, కూచిపూడి సీతారాం నృత్యం నికేతన్ అధినేత భార్గవి,దళిత ప్రజా వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చోళ రాజు,రాష్ట్ర యువజన విభాగం స్టేట్ కమిటీ సభ్యులు అరే చిన్ని,దళిత ప్రజాశక్తి యువజన విభాగం సోమ బత్తుల సురేంద్ర కుమార్,ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉల్లం ధనరాజ్,నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

**దళిత ప్రజాశక్తి నూతన కార్యవర్గం సభ్యులు:**

మడికి లోవరాజు,మడికి ప్రసన్న కుమారి,వెంపటాపు వాసు, దెయ్యాల ప్రేమ కుమార్, దెయ్యాల అజయ్ కుమార్,రాజాల రాజు, చింతల కన్నబాబు,మరపర్ల ప్రకాష్, మరపల్లు హేమంత్ కుమార్,ఉల్లం ధనరాజ్, సోమబత్తుల సురేంద్ర నూతన కార్యవర్గం సభ్యులను మురారి రవికుమార్, అల్లు జయరాజ్ ప్రకటించి వీరిని సభకు పరిచయం చేశారు.

# ఇందుకూరుపేటలో అక్రమ గంజాయి రవాణా

## -అదుపులోకి ఇద్దరు నిందితులు



**దేవీపట్నం, జూన్ 30(తెలుగు రాష్ట్రం విలేకరి):**

ప్రోహిబిషన్, ఎక్సైజ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు ఆధ్వర్యంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ త్రినాథ్ రంపచోడవరం ఎక్సైజ్ సీఐ శ్రీధర్,ఎస్సై పైడేశ్వరరావు కలిసి దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామ సమీపంలో దారిని గమనిస్తూ వెళ్లుతుండగా ఆటోలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని 180 కేజీల గంజాయిను స్వాధీన పరుచుకుని, సదరు గంజాయి రవాణాకి ఉపయోగించిన ఆటోను సీజ్ చేయడం జరిగిందని ఎక్సైజ్ సిఐ శ్రీధర్ తెలిపారు.

# ప్రజా గ్రీవిన్స్ కు 97 అర్జీలు



**రంపచోడవరం, జూన్ 30 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల దరఖాస్తులు వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కార మార్గాలు అన్వేషించి సమస్యలు పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈవారం 97 దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, అడిషనల్ డిఎంహెచ్వో జి.శిరీష, పశుసంవర్ధక వైద్యాధికారిని డాక్టర్ గోపిక, ఉపాధి హామీపథకం ఏపీడి బి.సత్యనారాయణ, ఎంఏఓ కె. లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవి కుమార్, వెలుగు ఏపిడి దేగలయ్య, పిఏఓ ఎల్.రాంబాబు, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిని యం.సావిత్రి, తాసిల్దార్ బాలాజీ, ఎంపీడీవో పి. జయంతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, చైతన్య, మల్లికార్జున రావు,సుబ్బారావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ , డిప్యూటీ తాసిల్దారులు శ్రీధర్, రవీంద్రబాబు, త్రిమూర్తులు, సూపర్డెంట్ బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బాలరాజుపై తప్పుడు వార్తలు రాసిన విలేఖరి అరెస్టు

## -కూటమి శ్రేణులు హర్షం



**జీలుగుమిల్లి, జూన్30 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పై గత ఆరు నెలలుగా తప్పుడు వార్తలు ప్రచురిస్తున్న ఓ ఆంగ్లపత్రిక విలేకరిని పోలీసులు అరెస్టు చేయడంపై జీలుగుమిల్లిలో కూటమి నాయకులు పోలీసులను అభినందిస్తూ సోమవారం స్థానిక జగదాంబ కూడలిలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం గా ఉన్న పత్రికా వృత్తి చాలా పవిత్రమైనదని, ఇలాంటి వృత్తిలో పనిచేస్తూ ఎమ్మెల్యే బాలరాజు పై సంబంధిత విలేకరి రుజువులు లేకుండా అవినీతి ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. బాలరాజు పై తప్పుడు వార్తలు రాసిన విలేకరిని పోలీసులు అరెస్టు చేయడంపై ప్రజలు అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ అరెస్టుపై పోలీసు యంత్రాంగాన్ని అభినందిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. ఇలాంటి రాతలను ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ములిశెట్టి యుగంధర్, మాదేపల్లి శ్రీను, మేటి సంజయ్, కుమార్ నాయుడు, అడపా నాగరాజు, రాయి సుబ్బారావు, సాదు చెన్నారావు, బుడిపిట చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# 50 ఏళ్ళ తర్వాత సిటీ మున్సిపల్ స్కూలు పూర్వ విద్యార్థుల అపూర్వ సంగమం

## -విద్యాబుద్ధులు నేర్పించిన గురువులకు సత్కారం



**రాజమహేంద్రవరం, జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**

రాజమహేంద్రవరం సిటీ మున్సిపల్ హైస్కూల్లో 1974-75 సంవత్సరం పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక సరదాగా సందడిగా జరిగింది. 50 ఏళ్ళ తర్వాత కలిసిన విద్యార్థులు చదువులమ్మ చెట్టు నీడలో నాటి సరదాలను,చిలిపి సంగతులను,తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుని చిన్న పిల్లల్లా కేరింతలు కొట్టారు. వైఎంవిఎ హాలులో కలిసిన విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పించి ఈనాటి తమ ఉన్నతికి కారణమైన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. స్వర్ణోత్సవ సంవత్సరంలో తిరిగి కలిసిన విద్యార్థుల అపూర్వ సంగమంలో ఆనాటి మధుర స్మృతులను, తిరిగిరాని బాల్యాన్ని మరోసారి జ్ఞప్తికి తెచ్చుకొని ఆనందంగా గడిపారు. ఇప్పుడు ఎవరెవరు ఏ స్థాయిలో ఉన్నారో అడిగి తెలుసుకుని పరస్పరం శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుకొన్నారు. ఆత్మీయ కలయిక ఇంత సంతోషంగా జరిగేందుకు పూర్వ విద్యార్థులు మాజీ కార్పొరేటర్ మంచాల బాబ్జి, ఉదయగిరి భగవాన్, యలమర్తి సాయిరామ్, కోరుకొండ శ్యాంబాబు, చందులూరి నాగేశ్వరరావు, బోడా వెంకటరమణ స్వర్ణోత్సవ కమిటీగా ఏర్పడి అందరూ హాజరయ్యేలా చేశారు. కార్యక్రమంలో వాసిరెడ్డి కృష్ణ, సిద్దినీడి వీర్రాజు, కంతేటి కృష్ణారావు, బాలగురు భాగవతులు, గ్రంధి చలం, పోలినాటి వెంకటేశ్వరరావు, సూరత్తు వాణీరావు, పులవర్తి చిరంజీవి, గునిశెట్టి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు

# జూల్కై 1న ఛలో రాజానగరం కార్యక్రమంలో స్వల్ప మార్పులు



**రాజమహేంద్రవరం, జూన్30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**

రవాణా వాహనాల ఫిట్‌నెస్‌ను (బ్రేక్) రవాణా శాఖ అధికారుల నుండి ప్రైవేట్ సంస్థలకి కూటమి ప్రభుత్వం అప్పగించడాన్ని నిరసిస్తూ జూల్కై 1న చేపట్టిన ఛలో రాజానగరం కార్యక్రమంలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయని జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్లు వాసంశెట్టి గంగాధర్, బాక్స్ ప్రసాద్ వెల్లడిరచారు. స్థానిక కంబాలచెరువు వద్దనున్న మెగా పార్టీ రూమ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జూల్కై 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఉన్న నేపథ్యంలో పోలీసుల సూచనల మేరకు ఈ కార్యక్రమంలో మార్పులు జరిగాయని వారు వివరించారు. మంగళవారం చేపట్టిన రవాణా వాహనాల బంద్ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని తెలిపారు. భారీస్థాయిలో ఛలో రాజానగరం చేపట్టాలని కార్యాచరణ చేసినప్పటికీ పోలీసుల సూచనల మేరకు పరిమిత సంఖ్యలో ఈ ఆందోళన చేపట్టేందుకు నిర్ణయించామన్నారు. పోలీసులు ఇచ్చిన అనుమతి మేరకు కొద్ది మంది కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఉదయం 10 గంటలకు రాజానగరం వెళ్లి అక్కడ నిరసన తెలియజేసి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతామని తెలిపారు. ఈ మార్పులను లారీ, వ్యాన్, ఆటో, టాక్సీ యూనియన్ల ఓనర్ కం డ్రైవర్లు గమనించాలని కోరారు. అఖిల పక్ష సమావేశంలో పలు పార్టీల నాయకులు, కార్మిక, రవాణా సంఘాల నాయకులు హాజరై తమకు సంఘీభావం తెలపడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే తమ సమస్యకు ప్రభుత్వం నుంచి సానుకూల పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆటోలు, ఇతర వాహనాలు యధావిధిగా తిరుగుతాయని ఈ మార్పును ప్రజలందరూ గమనించాలని విజ్ఞప్తి చేసారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

## మెప్మా సిబ్బందికి ట్యాబులు అందజేత



**చింతలపూడి, జూన్ 30 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్ లను చింతలపూడి నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం నగర పంచాయతీ కమిషనర్ అంబటి రాంబాబు, పట్టణ తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఆధ్వర్యంలో మెప్మా సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఈ ట్యాబ్ లను ఉపయోగించి ప్రజలకు త్వరితగతిన సేవలు అందిచాలని అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించిన విధంగా ప్రతీ ఒక్కరు సాంకేతికతను తమ దైనందిక జీవతంలో భాగస్వామ్యం చేసుకోనే విధంగా మెప్మా సిబ్బంది ట్యాబును వినియోగించాలని సూచించారు. మెప్మా ద్వారా మహిళా సంఘాల బలోపేతానికి, వారి ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ ట్యాబ్‌లు మెప్మా సిబ్బందికి తమ విధుల నిర్వహణలో, డేటా ఎంట్రీలో, సమాచార మార్పిడిలో ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి పట్టణ తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు తాటి అప్పారావు, చీదరాల మధుబాబు, కొత్తపల్లి విజయ కుమారి, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



**పోలవరం, జూన్ 30(తెలుగు రాష్ట్రం విలేకరి):** పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే నుంచి రూ. 28,879 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారులు ఆదివారం తెలిపారు. ఎగువ కొండవాగుల జలాలు గోదావరిలో కలిసి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ వస్తుంది. అదనంగా వస్తున్న నీటిని ప్రాజెక్టు స్పిల్ వే 48 గేట్లు, స్పిల్వేలో ఆరు స్లూయిజ్ గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 26.090 మీటర్లు, దిగువన 17.290 మీటర్లు ఎగువ కాపర్ డ్యామ్కు ఎగువన 26.120 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్కు దిగువన 14,180 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్ మధ్య 15,320 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

## అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన వైసీపీ నాయకులు గన్నవరపు



**అంబాజీపేట, జూన్ 31 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** మండల పరిధిలోని గంగలకుర్రు అగ్రహారం గ్రామం లో అగ్ని ప్రమాదంలొ గురి అయిన వైద్యులు షేక్ సుజహాన్ కుటుంబ సభ్యులును వై.ఎస్.అర్ కాంగ్రెస్ పార్టీ పి.గన్నవరం నియోజకవర్గం కొ ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించి ప్రమాద పరిస్థితి ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరావు, మండల వైసీపీ అధ్యక్షులు విత్తనాల ఇంద్రశేఖర్, ఎమ్ ఎమ్ శెట్టి, సుధాబత్తుల రాము, ఉందుర్తి నాగబాబు, మద్దింశెట్టి మల్లిబాబు ,గ్రామ శాఖ రాయుడు మీరయ్య, పితాని సతీష్, రాయుడు షణ్ముఖ్ సరేళ్ళ వెంకట్రావు, మట్టా ఏడుకొండలు, రాయుడు కృష్ణ మహేష్, కట్టా సుబ్రహ్మణ్యం, విత్తనాల బాలరాజు, తదితరులు ఉన్నారు.

## యమలోకానికి దారి చూపుతున్న రోడ్లు



**టీ.నర్సాపురం, జూన్ 30 (తెలుగురాష్ట్రం విలేకరి):** చింతలపూడి నుండి టీ. నర్సాపురం, బొర్రంపాలెం, జంగారెడ్డిగూడెం వెళ్లే రహదారిలో ప్రతినిత్యం వందల సంఖ్యలో ప్రయాణం చేసే వాహనదారులకు రోడ్లు గుంతల మాయంగా ఉండటంతో వాహనదారులు ప్రయాణం చేయాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని వెళు_న్నామని వాహనదారులు తెలిపారు. ప్రభుత్వాలు మారినా కానీ రహదారులను మరమతులకు కూడా నోచుకోవట్లేదని కొన్నేళ్లగా ఈ రహదారిపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నామని అన్నారు. గత కొన్ని రోజుల క్రితం వాహనాలు తిరగబడి ప్రాణాపృస్థితి నుంచి బయటపడ్డారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులు రహదారులను మరమ్మత్తులు చేయవలసిందిగా పలువురు వాహనదారులు, గ్రామస్తులు కోరారు.

# మాతృభాషలోనే ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్లను అమలు చేయాలి-మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, జూన్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నేర పరిశోధన కై జ్యూడిషియరి పోలీస్ లను నియమించాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సూచించారు. పిర్యాదుల మేరకు మాత్రమే ఎఫ్ ఐ ఆర్ లను నమోదు చేసే అధికారం ఉండాలని , అది కూడా మాతృ బాషలోనే వుండే వుండే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన సంస్కారణలను అమలు చేయాలని , కేసులకు సంబందించిన పూర్తి ప్రక్రియ అంత మాతృ బాషలోనే అమలు జరిగే విధంగా ప్రభుత్వ చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం అమలవుతున్న ఎఫ్ ఐ ఆర్(154 సి ఆర్ పి సి)ఆంగ్ల విధానాలతో బాధితులు అనాదిగా మోసపోతున్నారు . ముద్దాయిలు తప్పించుకుంటున్నారు . అమాయక ముద్దాయిలు బలై పోతున్నారు . ప్రభుత్వ న్యాయవాదులు, వాది, ప్రతివాదుల న్యాయవాదులు న్యాయాన్ని గెలిపిస్తున్నారో , అమ్మేస్తున్నారో వాది, ప్రతి వాదులకు అర్ధం కావటం లేదు, ముద్దాయిలకు, అమాయక ముద్దాయిలకు ఏమి జరిగిందో ఎలా గెలిచామో, ఎలా ఒడి పోయమో అర్ధం కాని పరిస్థితులు ఆంగ్ల నేర పరిశోదన విధానాలు నిత్యం సమాజాన్ని వెంటాడుతు వేదిస్తున్నాయి . నేటి ఆంగ్ల నేర పరిశోధన ఎక్కువ శాతం తప్పులు చేసే వారికి, నేరస్తులకు, ఆర్ధిక నేరగాళ్లకు మాత్రమే అనువుగా ఉందనే అపోహాలు సామాన్య ప్రజల హృదయాలను నిత్యం వేదిస్తున్నాయి. నేటి నేరపరిశోదన విధానాలు అంటే చట్టంతో వేధించటం.న్యాయంతో శిక్షిటంగా అమలు జరుగుతుంది . రాజ్యాంగ బద్ధమైన హక్కులకు, స్వేచ్ఛ కు మన వ్యవస్థలో విలువ లేకుండా పోతుందని , సగటు పౌరులు నేడు నేరస్తులకు ఒక రకంగా భయపడుతున్నారు . చట్టం , న్యాయాలను ఆశ్రయించటానికి మరో విధంగా భయపడుతున్నారు. రక్షణ పొందగలమనే నమ్మకం సామాన్యులకు లేక పోతుందని ఆయన తీవ్ర ఆవేదన చెందారు .పోలీస్ శాఖ కు కేవలం బాధిత పిర్యాదు మేరకు విచారణ జరిపి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసే అధికారం మాత్రమే ఉండాలని , కేసు పూర్తి దర్యాప్తుతో ఛార్జిషీట్ దాఖలు చేసే సర్వోన్నత అధికారం సాధారణ పోలీస్ కు సంబంధం లేని ఒక ప్రత్యేక జ్యూడిషియరీ పోలీస్ శాఖ ను ఏర్పాటు చేయాలని , ప్రస్తుత విచారణ ప్రక్రియ గమనిస్తే అర్ధవంతంగా సామాన్యుల జీవితాలు ముగిసి పోతున్నాయి . చట్టం కాపాడుతుంది. న్యాయం రక్షిస్తుందనే నమ్మకం పౌరులు రోజు రోజుకు కోల్పోతున్నారు. హక్కుతో కేసు కట్టించుకోవటం సగటు భారతీయుడికి సాధ్యం కాని పనిగా వుంది. ఒక బాధితుడు పిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలంటే ఖచ్చితంగా ఒక స్థానిక నేత అండ అయినా వుండాలి. లేకుంటే సొమ్ములు అయినా ఉండాలి. ఇవి ఏమి లేకుంటే న్యాయం పొందటం ఎడారిలో బావి వంటిదేనని, ప్రస్తుత సమాజంలో సంఘ విద్రోహులు కన్నా కొంతమంది పాలకులను , పోలీస్ లను చూస్తేనే ప్రజలు భయపడుతున్నారు. పోలీస్ పనితీరుకు భయపడి ఎందరో బాధితులు, అబాగ్యులు పోలీస్ స్టేషన్ కు వెళ్ళటానికి భయండి ఇంట్లోనే బిక్కు బిక్కు మంటు భయంతో జీవిస్తున్నారు . సాధారణ నేరాలకు సంబంధించి కేసు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసే హాక్కు మాత్రమే పోలీస్ లకు కల్పించి , కొన్ని క్రూర నేరాలకు సంబంధించి రేపిడ్ పోలీస్ స్టేషన్ల ను ఏర్పాటు చేస్తే కొంతమేరకు శాంతి భద్రతలు సజావు స్థితికి వస్తాయేమో నని ప్రభుత్వం పరిశీలన చేయాలి . మెరుగైన సంస్కరణ లుతో పోలీస్ విధానాలను ప్రవేశ పెట్టాల్సిన అవసరం వుందని మేధావులు, మంచి పాలకులు గుర్తించాలని ఆయన కోరారు.నిజమైన నేరాలు ఋజువు కావటానికి ప్రతి జిల్లా లోను నేర పరిశోధన శాస్త్రీయ పరిక్షా కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి . ప్రస్తుత పరిస్థితుల్లో నేరస్తులు భయట దర్జాగా వుంటున్నారు. నిర్దోషులు జైళ్ళ లో వుంటున్నారు . నేర ఘణాంకాల ప్రకారం మొత్తం ఖైదీల సంఖ్య 5 లక్షల 73 వేలుగా ఉండగా 4 లక్షల 37 వేల మంది బెయిల్స్ లేకుండా జైళ్ళలో మగ్గి పోతున్నారు . 24 వేల మందిపై విచారణలే ముగియలేదు. గత 5 ఏళు _గా 11 వేల మంది మంది న్యాయం అందక మగ్గి పోతున్నారు. ప్రస్తుత సాధారణ పోలీసు లకు నేర పరిశోధనలో కనీస పరిజ్ఞానం కూడా లేక పోతుంది. పోలీస్ లు కేసులు కదుతున్నారు. న్యాయస్థానాల్లో పోలీస్ కేసులు వీగి పోతున్నాయి. సాధారణ పోలీస్ లు దాఖలు చేసే చార్జషీట్ లన్ని డీటెక్టివ్ కథలు వలే ఒకే కథ అన్ని కేసుల్లోను నడుస్తుంది. వాస్తవ నేర ఘటన దర్యాప్తు నివేదికలో మచ్చుకు సైతం కనపడదు. మన ఓట్లు వేసి ఎన్నుకునే నేతకు రాజ్యాంగంపై అవగాహన ఉండదు. ప్రభుత్వ ఉద్యోగికి చట్టం తెలియదు. అవినీతి మాత్రమే నేరగాడిని , నిర్దోషిని సాశిస్తుందనేది మాత్రమే నిజం అని ఆయన తీవ్ర మనస్థాపం చెందారు.పోలీస్ లకు పని ఒత్తిడి కావొచ్చును , అధికారుల ఒత్తిడి, వేధింపులు కావొచ్చును ఏదో ఒక కారణం చేత కానిస్టేబుల్ నుండి ఎస్ ఐ వరకు భరించలేని మానసిక ఒత్తిడికి గురవుతూనే వుంటున్నారు . ఆ విధమైన ఒత్తిడిలో విధులు నిర్వహించే సమయంలో కాస్త చికాకు, అసహనం ఏర్పడటం సహజ లక్షణం . అలాంటి పరిస్థితుల్లో ఫిర్యాదులు కోసం వచ్చే బాధితులు పట్ల సరైన రీతిలో స్పందించక కాస్త క్రూరంగా కనపడుతుంటారు . అనేక సందర్భల్లో పాలకులు పోలీస్ లకు వారం సెలవులు ప్రకటిస్తాం అంటు వారిని దగా చేస్తున్నారు . ఇప్పటికైనా పోలీస్ లకు పాలకులు చేసిన ఓగ్దానం మేరకు వారం సెలవులు ప్రకటించి పోలీసుల మానసిక ఒత్తిడి లేని మంచి వాతావరణాన్ని కల్పించాలి . ప్రస్తుతం అమలవుతున్న బూజు పట్టిన నేర పరిశోదన విధానాల్లో మెరుగైన సంస్కరణలతో సాధారణ పోలీస్ లకు ఎఫ్ ఐ ఆర్ వరకు మాత్రమే అధికారం వుండే విధంగాను, నేరం తీవ్రతను బట్టి అరెస్ట్ లకు రేపిడ్ పోలీస్ లను, ఛార్జిషీట్ దాఖలు కోసం జ్యుడిషియరి పోలీస్ ను మూడు విభాగలుగా ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు దృష్టి సారించాలి . మరిన్ని సంస్కరణలు అవసరం మేరకు అమలు చేసే విధంగా ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ, నిఘా బృందాల నివేదికలు యుద్ద ప్రాతిపదిక సిద్ధం చేస్తుండాలి . భారతదేశంలో రాజ్యాంగం , చట్టాలు అమలు కావటం లేదు . న్యాయంస్థానాల్లో న్యాయం ఖరీదైనాదిగా బాధితులను వేధిస్తుంది. చట్టాలు అమలు కాని సమాజం . హక్కులు పొందలేని పౌరులు లతో కట్టడి చేయలేని ప్రజా తిరుగుబాటు పురుడు పోసుకుంటాయాన్ని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ హెచ్చిరించారు.ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి , సిమ్మా దుర్గారావు , దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్, మేడిచర్ల శ్రీనివాసరావు, సుంకర వెంకట భాస్కర రంగారావు , ముప్పన రమేష్ , ఆకుల మణికాంత్ , కారుమూరి యుగంధర్, పసుపులేటి వీర్రాజు , చల్లా సాంబశివరావు , చల్లా అఖిల్ , పెదిరెడ్డి కొండలరావు, మాసా అప్పాయమ్మ , మాసా సుభద్ర , మాసా కుశలయ్య , అడపా శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యపై ఏఈతో చర్చించిన ఎంపీపీ కారం లక్ష్మి



**విఆర్ పురం, జూన్ 30 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** మండలంలో ప్రతిరోజు విద్యుత్ ట్రిప్ అయి ప్రతి రోజు కరెంటు పోవడం చిమ్మ చీకట్లో దోమల బెడద, పాము పుట్రా భయంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఎంపీపీ కారం లక్ష్మీ దృష్టికి స్థానిక ప్రజలు తీసుకురావడంతో వెంటనే స్పందించారు. సిపిఎం పార్టీ మండల నాయకత్వంలో విద్యుత్ ఏఈ (కూనవరం సబ్ స్టేషన్) వారిని మండల ప్రజా పరిషత్ కార్యాలయం కు పిలిపించి ప్రతిరోజు ఏ కారణం చేత మండలంలో విద్యుత్ లేకుండా పోతుందని విద్యుత్ లేకుండా ఉండటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎందుకు ఈ సమస్య అని అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన ఏఈ మాట్లాడుతూ వి ఆర్ పురం మండలానికి ఉన్నటువంటి ఫీడర్ ట్రాన్స్ఫార్మర్ పూర్తిగా కాలిపోవడం వలన ఎక్కువ లోడ్ పడి తరుచుగా ట్రిప్ అవుతుందని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానని కొత్త ట్రాన్స్ఫారం మంజూరి కొరకు ఎస్టిమేట్స్ వేసి పంపామని ఒక వారం రోజులు సమయం పడుతుందని అప్పటివరకు కరెంటు ఇబ్బందులు తప్పవని ఆయన తెలిపారు. అదే విధంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామగిరి చెరువు వద్ద స్థంబాలు పైకి మార్చాలని అడవి వెంకన్నగూడెం గ్రామం వాగులో ఉన్న స్థంబాలు ఎత్తు పెంచాలని ఏఈ కి తెలపగా వెంటనే చేపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, పోడియం శ్రీరామమూర్తి, కారం సుందరయ్య, గుండుపూడి లక్ష్మణరావు, కమ్మసిచు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఎస్ పాయింటును తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



**చింతలపూడి, జూన్ 30 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్ ను నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ నందు రేషన్ సరుకులు బియ్యం, పంచదార, కందిపప్పు, బెల్లం, రాగి పిండి, స్టాక్ వేరియేషన్ ను సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ పరిశీలించారు. స్కూల్ పిల్లలకి ఇచ్చే ఎండిఎం రైస్, హాస్టల్ రైస్ త్వరగా పంపించాలని గోడౌన్ ఇంచార్జి కి సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలో చాట్రాయి సివిల్ సప్లై డీటీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు జీఎస్టీ మినహాయింపునివ్వాలి -స్టాలిన్ బాబు



**అంబాజీపేట, జూన్ 30 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని కోనసీమ ప్రాంతానికి చెందిన సామాజిక వేత్త నేలపూడి స్టాలిన్ బాబు సెంట్రల్ జిఎస్టి అదనపు చీఫ్ కమిషనర్ ప్రశాంత్ కుమార్ కాకర్లను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐఆర్ఎస్ అధికారి ప్రశాంత్ కుమార్ ను ఇటీవల ఈ పదవిలో నియమించిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విశాఖపట్నంలోని సెంట్రల్ జిఎస్టి కార్యాలయంలో పుష్పగుచ్ఛముతో అభినందించారు. కోనసీమ సుభిక్షమైన వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఎంతో ఖ్యాతిగాంచిందని తెలిపారు. ఇటీవల కాలంలో కోనసీమ తలసరి ఆదాయం గణనీయంగా పడిపోతూ, కరువు కాటకాలకు నిలయమైన అనంతపురం కంటే కోనసీమ తలసరి ఆదాయం తక్కువగా ఉన్నదంటూ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతానికి చేయూతనివ్వవలసిన అవసరం ఉన్నదని ఆయన తెలిపారు. జీఎస్టీ మినహాయింపులు ఇవ్వడం ద్వారా తలసరి ఆదాయం పెరిగే అవకాశం ఉన్నదని ఆయనకు వివరించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆయన హామీ ఇచ్చారని స్టాలిన్ బాబు తెలియజేశారు.

## కృష్ణాపురంలో భోగ్ బండారి



**టీ.నర్సాపురం, జూన్30 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పెద్ద తిరుపతి దేవాలయంను అభివృద్ధి చేసిన మహా భక్తుడు హాథిరామ్ బావాజీ 596వ జయంతి సందర్భంగా బంజారా భజరంగి భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామం లోని సంత్ సేవాలాల్ దేవాలయం దగ్గర భోగ్ భండారో కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. సంఘ జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారా జాతికి ఆధ్యాత్మిక బాటలు వేసి ధర్మ మార్గంలో నడిపించిన మహనీయుడు హాథిరామ్ బావాజీ అన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామికి బాలాజీ అని పేరు పెట్టినవాడు, ఏడుకొండలవాడితో వైకుంఠపాళి ఆట ఆడి ఓడించినవాడు, తన నిజాయితీని నిరూపించుకుని కొండ పైనే జీవ సమాధి అయిన మహా భక్తుడు హాథిరామ్ బావాజీ అని అన్నారు. సంఘ కోశాధికారి ధరావత్ రవి మాట్లాడుతూ వైకుంఠవాసి భక్తి మార్గాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రపంచం లోనే ఉన్నతమైన దైవంగా నిలపడంలో కృషి చేసిన హాథిరామ్ అని అతనికి చిన్న తిరుపతిలో విగ్రహం లేదా మఠంను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా రాములు, జరభల విజయ్ కుమార్,జరబల కృష్ణ ప్రసాద్. ధరావత్ సోమేశ్వరావు. జరబల రామకృష్ణ, జరభల భాజ, భూక్యా శ్రీను, భూక్యా వెంకటనారాయణ. జరబలకిషోర్. తదితరులు పాల్గొన్నారు

తెలుగురాష్ట్రం దినపత్రిక

SPORTS NEWS

https://epaper.teluguraastram.com

అమలాపురం
జులై 01,
మంగళవారం 2025



# ద్రవిడ్, సెహ్వాగ్ రికార్డ్‌పై యశస్వి జైస్వాల్ కన్ను



**దిల్లీ: యశస్వి జైస్వాల్ టెస్ట్ క్రికెట్‌లో ఓ మైలురాయికి అడుగు దూరంలోనే ఉన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో టీమ్ఇండియా తరఫున అత్యంత వేగంగా 2000 పరుగులు సాధించిన బ్యాటర్‌గా నిలిచే అవకాశానికి చేరువగా వచ్చాడు. ప్రస్తుతం ఆ రికార్డు సంయుక్తంగా.. రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ పేరిట ఉంది. వీరిద్దరూ ఈ ఫీట్‌ను 40 ఇన్నింగ్స్‌ల్లో సాధించారు.**

మొదట ద్రవిడ్ 1999లో న్యూజిలాండ్‌పై, వీరేంద్ర సెహ్వాగ్ 2004లో ఆస్ట్రేలియాపై ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. యశస్వి జైస్వాల్ 2023 జులైలో వెస్టిండీస్‌తో తన టెస్ట్ అరంగేట్రం చేశాడు. అతడు ఇప్పటి వరకు 38 ఇన్నింగ్స్‌ల్లో 52.86 యావరేజ్‌తో 1903 పరుగులు చేశాడు. జులై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో టీమ్ఇండియాకు జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో జైస్వాల్ మరో 97 పరుగులు సాధిస్తే.. ద్రవిడ్, సెహ్వాగ్ రికార్డ్‌ను అధిగమించే అవకాశం ఉంది.

లీడ్స్‌లో హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 159 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ఇందులో 16 ఫోర్లు, 6 సిక్స్‌లు ఉన్నాయి. అయితే రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం విఫలమయ్యాడు. 11 బంతుల్లో కేవలం 4 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ బాట పట్టాడు.

# ఆ రాత్రి నిద్రపోలేదు

**దిల్లీ: బార్బడోస్‌లో దక్షిణాఫ్రికాతో 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు ముందు ఒత్తిడితో కాళ్లు చేతులు ఆడలేదని.. ఆ రోజు రాత్రి నిద్రపోలేదని అప్పటి జట్టు కెప్టెన్ రోహిత్‌శర్మ తెలిపాడు. భారత్ టీ20 ప్రపంచకప్ గెలిచి జూన్ 29కి ఏడాది పూర్తయిన సందర్భంగా రోహిత్ నాటి విషయాలను గుర్తు చేసుకున్నాడు. "అప్పటికి భారత్ ప్రపంచకప్ గెలిచి 13 ఏళ్లు అయింది. ఇది చాలా సుదీర్ఘ కాలం. చాలామంది ఆటగాళ్లకు కనీసం పదమూడేళ్ల కెరీర్ కూడా ఉండదు. వారికి ప్రపంచకప్ కల తీరదు. నా వరకు 2007లో చివరిగా ఓ ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నా. అందుకే దక్షిణాఫ్రికాతో టీ20 ప్రపంచకప్ ఫైనల్‌ను మించింది లేదని అనిపించింది. తుదిపోరుకు ముందు రోజు రాత్రి నిద్ర పోలేదు. ఏవేవో ఆలోచనలతో కాళ్లు చేతులు ఆడలేదు. నా మనసంతా ప్రపంచకప్ మీదే ఉంది. ఒత్తిడిగా అనిపించింది. జట్టు ఉదయం 9 గంటల కల్లా బయల్దేరాలి. నేను 7 గంటలకే నిద్రలేచా. నా గదిలోంచి మైదానాన్ని చూస్తూ ఉన్నా. 'మరో రెండు గంటల్లో మైదానంలో ఉంటాం.. తర్వాత**



**కొన్ని గంటలకే ఫలితం వస్తుంది. కప్ ఎవరిదే తేలిపోతుంది' అనే ఆలోచనలు వచ్చాయి" అని రోహిత్ తెలిపాడు.**

చివరి ఓవర్లో మిల్లర్ కొట్టిన షాట్‌ను సూర్య క్యాచ్‌గా అందుకోవడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. అయితే అది సిక్స్ అనుకున్నానని రోహిత్ పేర్కొన్నాడు. "సూర్య పట్టిన క్యాచ్ సరైనదో లేదో తేల్చడానికి మైదానంలో అంపైర్లు.. థర్డ్ అంపైర్‌కి పంపించారు. ఆ సమయంలో జట్టు మొత్తం తీవ్ర ఒత్తిడికి గురైంది. సూర్య పక్కన (లాంగ్ ఆఫ్) ఫీల్డింగ్ చేస్తున్నా. నేనైతే అది సిక్సే అనుకున్నా. ఇక దక్షిణాఫ్రికాకు కావాల్సింది 5 బంతుల్లో 10 పరుగులే అని భావించా. 'సూర్యా.. చెప్పు.. అది క్యాచేనా' అని అడిగా? 'అవును.. బంతిని పట్టాను' అని అతడు చెప్పాడు. రీప్లేలో సూర్య గొప్పగా బంతిని అందుకున్నాడని తెలిసింది. నిజానికి అలాంటి క్యాచ్ పట్టడం అద్భుతం. కచ్చితంగా సిక్స్ వెళ్లే బంతి అది" అని రోహిత్ పేర్కొన్నాడు. ఉత్కంఠభరితంగా సాగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ 7 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించిన సంగతి తెలిసిందే. చివరి ఓవర్లో 16 పరుగులు అవసరం కాగా.. మిల్లర్ క్యాచ్‌ను సూర్య అద్భుతంగా పట్టి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు.

పంత్ తెలివిగా..: ఫైనల్లో కీలక సమయంలో రిషబ్ పంత్‌కు గాయం అయిందని కంగారు పడ్డాడని కానీ.. బ్యాటర్ల లయను దెబ్బ తీసేందుకు అలా చేశాడని తర్వాత అర్థమైందని రోహిత్ తెలిపాడు. "దక్షిణాఫ్రికా గెలవాలంటే 30 బంతుల్లో 30 పరుగులు చేస్తే చాలు. అవకాశం వారికే ఉంది. ఈ స్థితిలో హార్దిక్‌కు బంతి అందించి ఎలా బౌలింగ్ చేయాలో చెబుతున్నా. ఈలోగా వికెట్ కీపర్ రిషబ్ పంత్ నేలపై కూర్చొని ఫిజియోకు సైగలు చేశాడు. అసలే కారు ప్రమాదం నుంచి కోలుకుని వచ్చినవాడు కావడంతో మొదట భయపడ్డా. ఆ తర్వాత పంత్ కావాలనే అలా చేశాడని అర్థమైంది. బ్యాటర్లు జోరు మీద ఉండడంతో ఒక విరామం వస్తే లయ దెబ్బ తింటుందని అతడు భావించాడు. ఆ ఆలోచన ఫలితాన్నిచ్చింది. మ్యాచ్‌ను త్వరగా ముగించాలనే కంగారులో హార్దిక్ ఓవర్లో ఓ షాట్‌కు పోయి క్లాసెన్ ఔటయ్యాడు. అయితే మ్యాచ్ మావైపు తిరగడానికి పంతే పూర్తి కారణం అని చెప్పట్లేదు కానీ.. అతడో కారణం" అని రోహిత్ తెలిపాడు.

## ముంబయి ఇండియన్స్ న్యూయార్క్‌పై..

# టెక్సాస్ సూపర్ కింగ్స్‌దే విజయం!



**దిల్లీ: మేజర్ లీగ్ క్రికెట్ 2025లో భాగంగా దాలస్ వేదికగా ముంబయి ఇండియన్స్ న్యూయార్క్, టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఈ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 223 పరుగులు చేసింది. డుప్లెసిస్ (103) సెంచరీ సాధించాడు. డోనోవన్ ఫెరీరా 53 పరుగులు చేశాడు. న్యూయార్క్ బౌలర్లలో రుషిల్ ఉగార్కర్, జార్జ్ లిండే చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.**

తర్వాత 224 పరుగుల విజయ లక్ష్యంతో ఛేదన ప్రారంభించిన న్యూయార్క్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి కేవలం 184 పరుగులు మాత్రమే చేయగలిగింది. బ్యాటర్లలో పొలార్డ్ 70, క్వింటన్ డికాక్ 35 రన్స్ సాధించారు. టెక్సాస్ బౌలర్లలో అకీల్ హొసేన్ మార్కస్ స్టొయినిస్ చెరో రెండు వికెట్లు తీశారు. అకీల్ హొసేన్.. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ విజయంతో టెక్సాస్ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఆ టీమ్ వరుసగా మూడుసార్లు ఈ ఫీట్ సాధించింది.

# బుమ్రాను అయిదు టెస్ట్ మ్యాచ్‌లూ ఆడించాలి

## ఏబీ డివిలియర్స్



**దిల్లీ: భారత జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఆ టీమ్‌తో అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. లీడ్స్ వేదికగా ఇప్పటికే మొదటి టెస్ట్ మ్యాచ్ ముగిసింది. తొలి మ్యాచ్‌లో భారత జట్టు ఓటమి చవిచూసింది. రెండో టెస్ట్ మ్యాచ్ జులై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్లో ఎలాగైనా గెలవాలని టీమ్ఇండియా చూస్తోంది. అయితే వర్క్‌లోడ్ నేపథ్యంలో జస్ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాడు. టీమ్ఇండియా తీసుకున్న ఈ నిర్ణయంపై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ స్పందించాడు.**

'జస్ప్రీత్ బుమ్రా ఫార్మాట్లకు అతీతంగా ప్రపంచంలోనే అద్భుతమైన బౌలర్. అతన్ని కేవలం మూడు మ్యాచుల్లోనే ఆడించనుండటం సరైన నిర్ణయం కాదు. టెస్ట్ క్రికెట్ అత్యున్నతమైంది. అందుకే బుమ్రాను ఈ సిరీస్‌లోని మొత్తం అయిదు టెస్టు మ్యాచుల్లో ఆడించాలి. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అతడికి విశ్రాంతి ఇవ్వాలనుకుంటే.. అంతగా ప్రాముఖ్యం లేని టీ20, వన్డేల్లో ఆడించొద్దు' అని ఏబీ డివిలియర్స్ ఓ యూట్యూబ్ ఛానల్‌తో అన్నాడు.

అలాగే తాను దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా ఉన్నప్పుడు బౌలర్ డేల్ స్టెయిన్ వర్క్‌లోడ్ విషయంలో అనుసరించిన వ్యూహాలను పంచుకున్నాడు. 'మేం డేల్ స్టెయిన్ వర్క్‌లోడ్ నేపథ్యంలో అతన్ని ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్ వంటి ముఖ్యమైన జట్లతో జరిగే టెస్ట్ సిరీస్‌ల్లోనే ఆడించేవాళ్లం. అంతగా ప్రాముఖ్యం లేని టీ 20, వన్డే మ్యాచ్‌ల్లో అతడికి విశ్రాంతి ఇచ్చేవాళ్లం. అయితే టీమ్ఇండియా యాజమాన్యం బుమ్రాకు టెస్ట్ మ్యాచుల్లో విశ్రాంతినిస్తోంది. వైద్యుడు .. బుమ్రాను అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడొద్దని సూచించి ఉంటాడేమో. అదే నిజమైతే దాన్ని మనం గౌరవించాలి. భారత జట్టు బుమ్రా సేవల్ని.. సమర్థంగా, జాగ్రత్తగా వినియోగించుకోవాలి' అని డివిలియర్స్ వివరించాడు.

# అతడు ఒక్క సెంచరీతోనే ఆగిపోడు

## సంజయ్ మంజ్రేకర్



**దిల్లీ: ప్రస్తుతం భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. ఇందులోభాగంగా టీమ్ఇండియా ఇంగ్లండ్ జట్టుతో అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. అయితే లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో గిల్ సేన ఓటమి చవిచూసింది. అయినప్పటికీ ఆ మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ మంచి ప్రదర్శన కనబర్చింది. ఇది టీమ్ఇండియాకు సానుకూలాంశం. శుభ్‌మన్‌గిల్, కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ శతకాలు బాదారు. ఇక రిషభ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించాడు.**

పంత్ తన సూపర్ ఫామ్‌ను రెండో టెస్ట్ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తాడని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ ఆశాభావం వ్యక్తంచేశాడు. అలాగే కేఎల్ రాహుల్ కూడా రాణిస్తాడని వివరించాడు. 'రిషభ్ పంత్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అతడు దాన్ని రెండో టెస్ట్ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తాడు. ఒక టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించడం అంటే మామూలు విషయం కాదు. రిషబ్ పంత్ పరుగుల దాహంతో ఉన్నాడు. అతడు కచ్చితంగా మరిన్ని రన్స్ సాధిస్తాడు. అలాగే కేఎల్ రాహుల్ మొదటి టెస్ట్‌లో సెంచరీ చేశాడు. అతడు ఈ ఒక్క శతకంతోనే ఆగిపోడు. మరిన్ని అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడతాడు' అని సంజయ్ మంజ్రేకర్ విశ్లేషించాడు.

ఇంగ్లాండ్, టీమ్ఇండియా మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో జులై 2 నుంచి జరగనుంది. వర్క్‌లోడ్ నేపథ్యంలో జస్ప్రీత్ బుమ్రా రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఇంగ్లాండ్ స్క్వాడ్‌లో స్థానం సంపాదించుకున్న జోఫ్రా ఆర్చర్ రెండో టెస్ట్ మ్యాచ్ ద్వారా టెస్ట్ క్రికెట్‌లోకి పునరాగమనం చేసే అవకాశం ఉంది.



## అల్లు అర్జున్ చేయగలిగింది నితిన్ చేయలేకపోయాడు

నితిన్ హీరోగా వేణు శ్రీ రామ్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా తమ్ముడు. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సీనియర్ నటి లయ తమ్ముడులో కీలక పాత్రలో నటిస్తున్నారు. జులై 4న తమ్ముడు ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తో పాటూ నిర్మాత దిల్ రాజు కూడా యాక్టివ్ గా పాల్గొంటున్నారు.అందులో భాగంగా నితిన్, దిల్ రాజు కలిసి ఓ చిట్ చాట్ నిర్వహించగా, అందులో దిల్ రాజు నితిన్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో అతను నిర్మాతగానే నితిన్ దిల్ మూవీ చేయగా, ఇప్పుడు మరోసారి తమ్ముడు చేశారు. అయితే ఈ ఇంటర్వ్యూలో నితిన్, దిల్ రాజును ఓ ప్రశ్న అడిగారు. దిల్ సినిమా నుంచి తమ్ముడు సినిమా వరకు మీరు నాలో చూసిన మార్పులు, ప్లస్, మైనస్‌లు ఏంటని నితిన్ దిల్ రాజు ను అడిగారు.ప్లస్సులు, మైనస్సులు పక్కన పెడితే నువ్వు నా కంటే ఒక సంవత్సరం సీనియర్ అని, తాను 2003లో నిర్మాతగా మారగా, 2002లోనే నువ్వుగా హీరోగా అయ్యావని, నా కంటే ముందే నువ్వు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి హీరోవయ్యావని దిల్ రాజు నితిన్ తో అన్నారు. ఎలాంటి సినిమానైనా హ్యాండిల్ చేసే కెపాసిటీ, మేనేజ్ చేసే రేంజ్ ఇప్పుడు నితిన్ కు వచ్చిందని దిల్ రాజు అన్నారు.నితిన్ కంటే ఒక సంవత్సరం ఆలస్యంగా ఇండస్ట్రీలోకి వచ్చినప్పటికీ తాను నిర్మాతగా ఒక్కొక్కటి సాధించుకుంటూ టాప్ లోకి వెళ్లానని, నితిన్ ను కూడా తాను అలానే ఊహించానని కానీ అది నితిన్ అఛీవ్ చేయలేకపోయాడని అన్నారు దిల్ రాజు. ఆర్య సినిమా చేస్తున్నప్పుడు అల్లు అర్జున్‌ను, దిల్ సినిమా చేస్తున్నప్పుడు నితిన్ ను తాను ఫ్యూచర్ స్టార్లు గా భావించానని దిల్ రాజు చెప్పారు.అయితే తన అంచనాలను అల్లు అర్జున్ అందుకుని ఇప్పుడు నెక్స్ట్ లెవెల్ కు వెళ్లాడని, కానీ నితిన్ మాత్రం ఆ స్టేజ్ కు చేరుకోలేకపోయాడని దిల్ రాజు అన్నారు. అయితే తమ్ముడు సినిమాతో తనకు ఆ రేంజ్ వస్తుందా అని నితిన్, దిల్ రాజును అడగ్గా, తమ్ముడు సినిమాతో సక్సెస్‌ఫుల్ హీరోగా అవుతావు కానీ అది సరిపోదని, ఎల్లమ్మతో ఆ రేంజ్ ను అందుకోవాలని దిల్ రాజు నితిన్ తో చెప్పారు. ప్రస్తుతం నితిన్- దిల్ రాజుకు సంబంధించిన ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

## గురూజీ కాంపౌండ్ లో రానా!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో భారీ మైథలాజికల్ థ్రిల్లర్ చిత్రం లాక్ అయినట్లు ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. బన్నీ చేయాల్సిన స్క్రిప్ట్ తిరిగి తిరిగి తారక్ వద్దకు చేరినట్లు వినిపిస్తుంది. బన్నీ అట్లీకి లాక్ అయిన తర్వాత ఇదే స్టోరీ రామ్ చరణ్ వద్దకు వెళ్లిందని ప్రచా రంలోకి వచ్చింది. అక్కడ నుంచి తారక్ వద్దకు వెళ్లినట్లు జోరుగా వినిపిస్తుంది. తారక్ కూడా లాక్ చేసినట్లు వార్తలొస్తున్నాయి.ఈ నేపథ్యంలో తాజాగా మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. ఈ కథలో దగ్గుబాటా రానా ఎంటర్ అవుతు న్నాడుట. ఇందులో ప్రతి నాయకుడి పాత్రకు గురూజీ రానాని తీసుకుంటున్నట్లు కొత్త వార్త వినిపిస్తుంది. ఈ పాత్ర ఒక స్వామిజీ



తరహాలో ఉంటుందని... ప్రధాన ప్రతి నాయకుడి పాత్రగా వినిపిస్తుంది. మరి ఇందులో నిజమెంతో తెలియాలి. ఇదే నిజమైతే రానాకిది మంచి అవకాశమే. వెట్టేయాన్ తర్వాత రానా వెండి తెరపై కనిపించలేదు. అందులో విలన్ పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.ఆ తర్వాత మళ్లీ ఇంత వరకూ మరో సినిమా చేయ లేదు. హీరోగానూ కనిపించలేదు. విలన్ గానూ కనిపిం చలేదు. మధ్యలో నిర్మాతగా మాత్రమే బిజీగా ఉన్నా డు. హిరణ్యకశిష ప్రాజెక్ట్ అనుకున్నా? అది కార్యరూపం దాల్చలేదు. ఇలా కొంత కాలంగా రానా బండి లాగుతున్నాడు. తాజాగా గురూజీ రూపంలో మరో అవకాశం దక్కినట్లు అయింది.విలన్ పాత్రలు రానాకి కొత్తేం కాదు. బాహుబలితో పాన్ ఇండియాలోనే విలన్ గా ఫేమస్ అయ్యాడు. భల్లాల దేవ పాత్రతో తన కంటూ ఓ ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్నాడు. మళ్లీ అంతటి బలమైన పాత్రలు రాలేదు. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ ఆ రేంజ్ రోల్ ఇస్తున్నట్లే కనిపిస్తుంది.

ఫోటో క్లిక్



కాయాదు లోహర్.

## ఐటం పాట కోసం కరీనా కపూర్ ని ట్రై చేస్తున్నారా?



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రాజాసాబ్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ నత్త నడకన సాగిన షఉటింగ్ ఇప్పుడు పరుగులు పెడుతోంది. చక్కా చకా షఉటింగ్ పూర్తిచేసే పనిలో పడ్డారు. జులై తొలి వారంలో కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. అందులో ప్రభాస్ కూడా పాల్గొంటాడు. అది పూర్తయితే చిత్రీకరణ దాదాపు పూర్తయినట్లే. అటుపై పాటల చిత్రీకరణ మొద లవుతుంది.ఈ సినిమాలో ఓ స్పెషల్ ఐటం సాంగ్ కూడా ఉంది. ప్రభాస్ మాస్ ఇమేజ్ కు తగ్గట్టుగా ఆ పాటను డిజైన్ చేస్తున్నారు. తొలుత ఈ పాట కోసం థమన్ ఓ బాలీవుడ్ సినిమా గీతాన్ని రీమిక్స్ చేయాలని భావించాడు. కానీ తర్వాత ఆలోచన విరమించకుని ఓ ఫ్రెష్ సాంగ్ తోనే రావాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలోనే ఆ పాటలో ఐటం భాగమా లేడీ సూపర్ స్టార్ నయనతార అయితే బాగుంటుందనుకున్నారు.ఆమెను అప్రోచ్ అయినట్లు వార్తలొచ్చాయి. అయితే నయన్ ఆ పాటలో నటించడానికి అంగీకరించలేదని తేలింది. ఆ తర్వాత మళ్లీ ఐటం సాగ్ చర్చ రాలేదు. ప్రభాస్ పౌజీ షఉటింగ్ లో బిజీగా ఉండం..రాజాసాబ్ హెల్డ్ లో పడటంతో ఎలాంటి చర్చ రాలేదు. తాజాగా షఉట్ ప్రారంభమైన నేపథ్యంలో మళ్లీ ఐటం పాట లో హీరోయిన్ ఎవరు? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇండస్ట్రీలో మళ్లీ వాడి వేడి చర్చ జరుగుతుంది.ఈనేపథ్యంలో మారుతి ఏకంగా బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ కోసమే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలి సింది. ఇప్పటికే ఓ ఏజెన్సీ ద్వారా ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. మరి ఈ ఆఫర్ విష యంలో కరీనా ఎలా స్పందిస్తుందో చూడాలి. కరీనా కపూర్ బాలీవుడ్ లో పెద్ద హీరోయిన్. తనకంటూ ఓ ఇమేజ్ ఉంది. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కరీనా ఐటం పాటలకు ఒప్పు కుంటుందా? లేదా? అన్నది చూడాలి.

## బాలీవుడ్ ఆశలన్నీ ఎన్టీఆర్ మూవీపైనే..!

గత ఐదేళ్ల కాలంలో బాలీవుడ్ తీవ్రమైన ఒడిదొడుకులు ఎదుర్కొంటుంది. కరోనా సమయంలో బాలీవుడ్ సినిమాలు ఓటీటీ డైరెక్ట్ రిలీజ్ అయ్యాయి. ఆ సమయంలో ఓటీటీకి అలవాటు పడ్డ ఉత్తరాది ప్రేక్షకులు మళ్లీ థియేటర్ల వైపు తిరిగి చూసే పరిస్థితి కనిపించడం లేదు. సక్సెస్ రేటు దారుణంగా పడిపోయింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఏ విధంగా చూసుకున్నా కూడా బాలీవుడ్‌లో సినిమాలు ఆడటం లేదు. గడచిన ఐదేళ్ల కాలంలో బాలీవుడ్‌లో సూపర్ డూపర్ హిట్ అయిన సినిమాలు వేళ్ల మీద లెక్కించవచ్చు. స్టార్ హీరోల సినిమాలు కూడా కుప్పకూలుతున్నాయి. ఒకప్పుడు మినిమం వంద కోట్లు సాధించిన హీరోలు పాతిక కోట్లు రాబట్టడానికి కిందా మీదా పడుతున్నారు.ఏడాది మొత్తంలో అర డజను సినిమాలు ఆడుతున్నాయి. కొన్ని యావరేజ్ టాక్ దక్కించుకున్నా వాటికి కలెక్షన్స్ అంతంత మాత్రమే. 2024, అంతకు ముందు సంవత్సరాలతో పోల్చితే 2025 కాస్త ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది ప్రథమార్థంలో మంచి బిజినెస్ జరిగింది. ఎప్పటిలాగే కొన్ని సినిమాలు తీవ్రంగా నిరాశ పరచినప్పటికీ కొన్ని సినిమాలు మంచి వసూళ్లు నమోదు చేశాయి. ఈ మధ్య కాలంలో జనాలు థియేటర్లకు క్యూ కడుతున్నారు. మల్టీప్లెక్స్‌తో పాటు, సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో సినిమాలు ఆడుతున్నాయి. జూన్ వరకు బాలీవుడ్ మంచి ఫలితాన్ని చవిచూసింది. ఇక రాబోయే అర్థ సంవత్సరం ఫలితం ఎలా ఉంటుంది అనేది చూడాలి.2025 సెకండ్ హాఫ్‌లో విడుదల కాబోతున్న పెద్ద సినిమాల్లో 'వార్ 2' ఒకటి. హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న వార్ 2 సినిమాలో ఎన్టీఆర్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. భారీ అంచనాల నడుమ రూపొందిన వార్ 2 సినిమాను ఆగస్టు 14వ తారీకున ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతుంది. వెయ్యి కోట్ల వసూళ్లు టార్గెట్‌తో ఈ సినిమా విడుదల కాబోతుంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో భారీ



బడ్జెట్‌తో నిర్మించారు. ఇప్పటి వరకు యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో వచ్చిన స్పై థ్రిల్లర్ అన్నింటిలోకి ఈ సినిమా అత్యంత ఖరీదైన సినిమాగా బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అందుకే ఈ సినిమా పై అంచనాలు భారీగా ఉన్నాయి.బాలీవుడ్‌లో 2025 సెకండ్ హాఫ్‌లో మరిన్ని సినిమాలు విజయాన్ని సొంతం చేసుకుంటాయనే విశ్వాసంతో హిందీ ఫిల్మ్ మేకర్స్ ఉన్నారు. బాలీవుడ్ మెల్ల మెల్లగా పుంజుకుంటుందని, వార్ 2 వంటి స్పై థ్రిల్లర్ వెయ్యి కోట్ల వసూళ్లు సాధిస్తే కచ్చితంగా ముందు ముందు మరిన్ని విజయాలు నమోదు అయ్యే అవకాశాలు ఉంటాయని ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన సినిమాలు ముందు ముందు ఇండస్ట్రీ మనుగడకు కీలకంగా మారనున్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వార్ 2 సూపర్ హిట్ అయితే కచ్చితంగా బాలీవుడ్ ఊపిరి పీల్చుకోవచ్చు. అందుకే వార్ 2 పై బాలీవుడ్ ఆశలు పెట్టుకుని ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339